

బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న చలువ పందిళ్లు



నేటి నుంచి ప్రసన్నుడి
బ్రహ్మోత్సవాలు

బిలకూట క్షేత్రంలో పూర్తయిన ఏర్పాట్లు

బిట్రగుంట, మార్చి 18: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారం గిరిప్రదక్షిణతో ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గోమాత సమేతంగా బిలకూట క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ నిర్వహిస్తారు. రాత్రి అంకురార్పణ, 20న ఉదయం తిరుమంజనం, రాత్రి ధ్వజారోహణ, కొడిముద్దలు, అనంతరం స్వామివారికి శేషవాహనసేవ నిర్వహిస్తారు. 21న ఉదయ కాల పూజలు, హోమాలు, రాత్రి హనుమంతసేవ, 22న ఉదయం మోహిని ఉత్సవం, రాత్రి గరుడసేవ, 23న ఉదయం మొక్కుబడులు, మెట్లపూజ, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రి గజవాహనసేవ జరుగుతుంది. 24న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం చక్రస్నానం, రాత్రి అలకలతోపు, అశ్వవాహనసేవ, ధ్వజావరోహనం ఉంటుంది. 25న సాయంత్రం పుష్పయాగం, రాత్రి ఏకాంతసేవ నిర్వహిస్తారు.

● విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రసన్నుడి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, దేవతామూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రాధాకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్వామివారి కళ్యాణ ఆహ్వాన పిలుపుల్లో ఆలయ సిబ్బంది పరుగులు పెడుతున్నారు. ఏడాదికి ఒక్కసారి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలంటే గ్రామస్థులు పెద్ద పండువలా భావిస్తారు. ఇళ్లను రంగులు, పచ్చని తోరణాలతో అలంకరిస్తారు. బంధుమిత్రులకు ఆహ్వానం పలుకుతారు.

● హుండీ లెక్కింపు

ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. గడిచిన రెండు నెలల కాలంలో హుండీల ద్వారా రూ.10,19741 ఆదాయం లభించినట్లు చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : 6.24
సహరి (బుధవారం) : 4.53

గ్రామదారికి రిజిస్టర్ చేసి
కబ్జా యత్నం

● అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు

ఏఎస్ పేట, మార్చి 18 : నాయకుల అండ, అధికారుల సహకారం ఉంటే ప్రభుత్వ పొలాలు, ఖాళీ స్థలాలే కాదు గ్రామదారులనూ కబ్జాదారులు స్వాహా చేస్తున్నారు. ఏఎస్ పేట మండలంలోని తెల్లపాడు గ్రామంలో సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు రామాలయం వెనుక ఉన్న రెండో వీధిలో కొలతలు తీయడం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి కొలతలు తీస్తున్నారని గ్రామస్థులు అనుకున్నారు. కానీ ఆ స్థలం గ్రామనికి చెందిన వళ్లెం వెంగమ్మకు చెందినదని, ఆమెకు రిజిస్టర్ కూడా ఉండడంతో సర్వే చేయడానికి విచ్చేశారని తెలుసుకొని అవాక్కయ్యారు. వెంటనే గ్రామస్థులు నిలదీయడంతో అధికారులు వెనుతిరిగారు. అయితే, సాయంత్రం మళ్లీ అధికారులు రావడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు అధికారులు అక్కడ నుంచి జారుకున్నారు.



రంగడి తిరునాళ్ల
రేపటి నుంచి ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 18 : దేశంలోని పురాతన ఆలయాల్లో ఒక్కటైన నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. పెన్నా నది ఒడ్డున ఉన్న ఈ ఆలయంలో స్వామివారు శయనమూర్తిగా భక్తులకు దర్శనమిస్తారు. కాగా, 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 21న శేష వాహనం, 22న సూర్యప్రభ, చంద్రప్రభ, 23న సింహవాహనం, 24న హనుమంతసేవ, 25న బంగారు గరుడ సేవ, 26న కల్యాణం, గజవాహనసేవ, 27న రథోత్సవం, 31న తెప్పోత్సవాలు జరుగుతాయి.

వసతులు లేక ఇబ్బందులు

జిల్లాలో పలు పరీక్ష కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వసతుల కల్పనలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారంటూ పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఫ్యాన్లు కూడా లేని గదుల్లో పరీక్షలు ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మంచినీటి వసతులు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు తొలిరోజే అగ్నిపరీక్షను ఎదుర్కొన్నారు. జిల్లాలో అత్యధిక కేంద్రాల్లో మంచినీటి వసతులు లేకపోవడం, ఉన్న వాటర్ ప్లాంట్లన్నీ మూలనపడడంతో విద్యార్థులకు నీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమస్య ఉందని ముందస్తుగా తెలుసుకున్న విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాలతో నీళ్లు తెచ్చుకున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు, ఇంకొన్ని చోట్ల వెలుతురు సరిగా లేక చీకట్లోనే పరీక్ష రాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు సమయానికి కేంద్రానికి చేరుకునే క్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. మొత్తం మీద తొలిరోజే సమస్యల నడుమ టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి.



ఇక్కడే ఉంటాం.. ధైర్యంగా రాయండి : నెల్లూరులో ఓ పరీక్ష కేంద్రం వద్ద పిల్లలతో తల్లిదండ్రుల సందడి

ఉక్కపోత..
మంచినీటి కొరత!

తొలిరోజే పది విద్యార్థులకు అగ్ని పరీక్ష
కేంద్రాల్లో సౌకర్యాలు లేక అవస్థలు

సరస్వతీ నమస్తుభ్యం : పరీక్షకు ముందు అమ్మవారి ప్రార్థన



నెల్లూరు (విద్య), మార్చి 18 : జిల్లావ్యాప్తంగా 176 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు టెన్త్ పరీక్ష జరిగింది. తొలిరోజు తెలుగు పరీక్షకు 28,057 మంది హాజరవగా, 1,282 మంది (95.63 శాతం) గైర్హాజరు అయ్యారు. 7 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను 45 స్టోరేజీ పాయింట్లలో భద్రపరిచి అరగంట ముందు ఆయా కేంద్రాలక తరలించారు. 2,300 మంది ఇన్విజిలేటర్లతో పాటు 176 మంది సీఎస్‌లు, 176 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 25 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పాఠశాలల పరిసర ప్రాంతాల్లోని జెరాక్స్ సెంటర్‌లను మూసివేశారు. అలాగే పరీక్షా సమయానికంటే గంట ముందుగా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించినా కొన్ని ప్రాంతాల్లో రవాణా, ట్రాఫిక్ సమస్యల కారణంగా కొంతమంది విద్యార్థులు కొంత ఆలస్యంగా హాజరైనా కూడా అధికారులు అనుమతించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి హాల్‌టికెట్లను, తమకు కేటాయించిన గదులను బోర్డులలో పరిశీలించుకుంటూ హడావుడిగా కనిపించారు.



జాగ్రత్తసుమా !: సీతారామపురంలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయురాలు



టైం అయిపోతోంది..

● ఓపెన్ స్కూల్ పరీక్షలకు..

జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు 4,658 మంది అభ్యాసకులు హాజరయ్యారు. పదోతరగతికి 11 సెంటర్‌లు, ఇంటర్‌కు 19 సెంటర్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షల్లో టెన్త్‌కు 1524 మంది హాజరవగా 122 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్‌కు 3134 మంది హాజరవగా 186 మంది గైర్హాజరయ్యారు. 13 పరీక్ష కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియచేయాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లా ఖాన్ తెలిపారు.



అన్నీ ఉన్నాయిగా.. : కేంద్రంలో పరిశీలన



లింగసముద్రం : తండ్రి సాయంతో వస్తున్న దివ్యాంగుడు

కేంద్రాల పరిశీలన

జిల్లాలో పదోతరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. విద్యాశాఖ జేడీ, జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం, డీఈఓ పీజేవీ.రామారావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆయా కేంద్రాలను పరిశీలించారు. వసతులు సరిగా లేని ప్రాంతాల్లో వెంటనే వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రాల వద్ద ఉన్న తల్లిదండ్రులకు తెలియచేశారు. ఏదైనా సమస్యలు ఉంటే 8341408109 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?: నెల్లూరులోని పరీక్ష కేంద్రంలో వసతులపై తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం



దిష్టంతా పోవాలి.. వరికుంటపాడులో విద్యార్థులకు దిష్టితీస్తున్న బీజేపీ నాయకులు

పరస్పర సమన్వయంతోనే
ప్రశాంత ఎన్నికలు!

కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 : జిల్లా అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీల నాయకుల పరస్పర సమన్వయంతోనే ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సాధ్యమవుతుందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సహకరించాలని కోరారు. నామినేషన్ల పత్రాలు, అఫిడవిట్‌లో తప్పులు లేకుండా సమర్పించడం, కొత్త బ్యాంకు కొత్త ప్రారంభించడం, అభ్యర్థుల ఖర్చుల వివరాలు, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లింపు, వాహనాలు, సమావేశాలు, సభలు, ర్యాలీలకు అనుమతులు తదితరాలకు సంబంధించిన నిబంధనలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 18న ఫామ్-1 విడుదల చేస్తూ ఏ ఏ ప్రాంతాలలో నామినేషన్లు స్వీకరిస్తామో తెలియచేస్తామన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి రూ.25వేలు, అసెంబ్లీకి రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రిటర్నింగ్ అధికారులు వీరే!

నెల్లూరు పార్లమెంటుకు తాను (కలెక్టర్) రిటర్నింగ్ అధికారిగా ఉంటానన్నారు. కందుకూరుకు నియోజకవర్గానికి సబ్ కలెక్టర్, కావలి, ఆత్మకూరులకు ఆర్డీఓలు, కోవూరుకు జాయింట్ కలెక్టర్, నెల్లూరు సిటీకి కార్పొరేషన్ కమిషనర్, నెల్లూరు రూరల్‌కు నెల్లూరు ఆర్డీఓ, సర్వేపల్లికి తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్, ఉదయగిరికి ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వెంకటగిరికి తిరుపతి సబ్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, సమాచారశాఖ డీడీ సదారావు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

● డీఆర్‌డీఏలో మీడియా విభాగం

కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) విభాగాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఈ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనల కోసం ఎంసీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

కమాండ్ కంట్రోల్ పటిష్టంగా ఉండాలి

నెల్లూరు(హరనాథపురం); మార్చి 18 : నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కార్యకలాపాలను పటిష్టం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. సోమవారం ఆ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, స్వీప్ కార్యక్రమాలు, యంత్రాంగం చేపడుతున్న కార్యకలాపాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వికాస్ మర్మత్, తదితరులు పాల్గొన్నారు

'అధికార' దాసోహం!

ఈ చిత్రాల్లో వృత్తాకారంలో ఉన్న వారంతా ప్రభుత్వ ఉద్యోగులే.

సార్వత్రిక ఎన్నికల కోడ్ కూసినా అధికార పార్టీ నేతల సేవలో వారంతా తరిస్తున్నారు. నాయకులతో ప్రచారంలో పాల్గొంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. వరికుంటపాడులో వైసీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి విజయ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం రాత్రి జరిగిన ప్రచారంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు చిందులేస్తూ జేజేలు పలుకుతూ తమ వీరాభిమానాన్ని చాటుకొన్నారు. తూర్పు కొండారెడ్డిపల్లి, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు కాంచెరువుకు చెందిన ఎండీయూ వాహన ఆపరేటర్ నాయకుల వెంట నడుస్తూ తమ స్వామిభక్తిని చాటుకున్నారు.

● వైసీపీ నేతల ప్రచారాల్లో ఉద్యోగులు
● ఇంటింటా తిరుగుతున్న 'ఉపాధి' సిబ్బంది, వీఆర్వోలు, వలంటీర్లు

● చేజర్ల మండలం పాడేరు గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 'విజయీభవ' యాత్రలో వీఆర్‌వో లక్ష్మీప్రసాద్, వలంటీరు పవన్ పాల్గొనడం చర్చనీయాంశమైంది.

● బుచ్చిరెడ్డిపాళెంలోని ఇస్కపాలెం సచివాలయం పరిధిలో వలంటీర్లు అధికార పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విమర్శలకు తావిచ్చింది. చైర్‌పర్సన్ సుప్రజ, ఇతర నాయకులతో కలిసి ప్రచారం చేసినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంపై ప్రజల్లో విమర్శలకు తావిచ్చింది.

– వరికుంటపాడు/చేజర్ల/బుచ్చిరెడ్డిపాళెం



బుచ్చిలో అధికార పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న వలంటీర్లు (వృత్తంలో ఉన్నవారు)



చేజర్ల : విజయీభవ యాత్రలో విక్రమ్‌రెడ్డికి పక్కనే వలంటీరు, వీఆర్వో







వరికుంటపాడు : మేకపాటి ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఈయన ఎండీయూ వాహన ఆపరేటర్

లెక్కలడిగితే

మార్చేశారు..!



- అవినీతిని ప్రశ్నించినందుకు ఫలితం
- ఎం బుక్‌లు సక్రమంగా రికార్డు చేయని ఇంజనీర్లు
- వైసీపీ నేతలకు మేలు చేసేలా బిల్లుల నమోదు
- సర్వేపల్లి నియోజకవర్గంలోని బిల్లులపై అభ్యంతరాలు
- ఫలితంగా శ్రీకాకుళంకు ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ మేనేజర్ బదిలీ

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో ప్రశ్నించడమే తప్పయిపోయింది.. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలపై కేసులు పెట్టి వేధించిన అనేక ఉదంతాలను చూశాం.. ఇప్పుడు అవకతవకలను ప్రశ్నించినందుకు మరో ఉద్యోగిపై బదిలీ వేటు పడింది. ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను ఇటీవల ఆకస్మికంగా బదిలీ చేశారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో ఏకంగా శ్రీకాకుళం జిల్లాకు పంపారు. గడిచిన కొన్ని రోజులుగా ఇరిగేషన్ శాఖలో అంతర్గతంగా నలుగుతున్న ఈ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. కొందరు ఇంజనీర్లు వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరించడం, వారు చెప్పిన విధంగా పనులు చేయకుండానే బిల్లులు నమోదు చేశారు. ఎదురుతిరిగితే బదిలీ చేస్తారన్న భయంతో చాలామంది ఇంజనీర్లు అధికార పార్టీ నేతల అవినీతిలో భాగస్వాములుగా మారారు. వచ్చిందే అవకాశంగా వారు కూడా ప్రజా సొమ్మును జేబుల్లో వేసుకోవడం మొదలుపెట్టారు. ప్రధానంగా సెంట్రల్ డివిజన్ పరిధిలో పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. ఈ డివిజన్‌లో చాలామంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. కొందరు ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు, ఇరిగేషన్ స్థలాల ఆక్రమణలు, నామమాత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందులోనూ సర్వేపల్లి నియోజకవర్గంలో పనులు చేయకుండానే బిల్లులు పెట్టేశారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకు సంబంధించి ఇటీవల ఆధారాలు కూడా బయటపడ్డాయి. కానీ అవి తప్పు అని ఏ ఒక్క అధికారి కూడా ఖండించకపోవడం గమనార్హం. ఈ క్రమంలోనే ఆ నియోజకవర్గంలో ఎం బుక్‌ల నమోదులో అవకతవకలు జరిగినట్లు సెంట్రల్ డివిజన్ మేనేజర్ గుర్తించినట్లు సమాచారం.

ఎంబుక్‌లో వివరాలు ఏవి?

ఒక పని నిజంగా పూర్తిస్థాయిలో చేసి ఉంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఎంబుక్‌లో నమోదు చేయాలి. దాని ఆధారంగానే బిల్లులు అప్‌లోడ్ చేస్తారు. కానీ చాలా ఎంబుక్‌లలో పూర్తి స్థాయిలో వివరాలు లేవు. ఎంత పని చేశారు అన్న లెవల్స్ కూడా నమోదు చేయలేదని తెలుస్తోంది. వీటిపై సెంట్రల్ డివిజన్ మేనేజర్ అభ్యంతరాలు చెప్పినట్లు సమాచారం. ఆ ఎంబుక్‌ల ఆధారంగా బిల్లులు అప్‌లోడ్ చేస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని భావించిన సదరు మేనేజర్ వీటిపై సంబంధిత ఇంజనీర్లను వివరణ అడిగినట్లు తెలిసింది. అదే సమయంలో ఇంజనీర్లు రికార్డు చేసిన విధంగానే మేనేజర్ కొన్ని బిల్లులు అప్‌లోడ్ చేయగా అవి పీఏవోలో తిరస్కరణకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీ నాయకులు, ఇంజనీర్లకు సదరు మేనేజర్‌పై కోపం వచ్చి ఆయనను బదిలీల సమయం కాకపోయినా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ చేసినట్లు చర్చించుకుంటున్నారు. అదీ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేయడం ద్వారా మరో అధికారి తమ అవినీతిని ప్రశ్నించకూడదన్న సంకేతాలు ఇచ్చారని ఆ శాఖలో గుసగుసలాడడం గమనార్హం.

ఆత్మకూరు మద్యం దుకాణంలో చోరీ

- రూ. 3.89 లక్షల అపహరణ


విచారణ జరుపుతున్న ఎస్‌ఐ ముత్యాలరావు

ఆత్మకూరు, మార్చి 18: స్థానిక బీఎస్ఆర్ సెంటర్ సమీపంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణం వెనుకవైపు గోడకు రంధ్రం వేసి క్యాష్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల మేరకు.. మద్యం దుకాణంలోని క్యాష్ బాక్సులో ఉన్న రూ.3.89 లక్షలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంగంలో చోరీ యత్నం

- అలికిడితో నిద్ర మేల్కొన్న వాచ్‌మన్
- కారులో దుండగుల పరారీ


వాచ్‌మన్‌ను విచారిస్తున్న సీఐ రవినాయక్, ఎస్‌ఐ

సంగం, మార్చి 18: స్థానిక బస్టాండ్ కూడలిలోని ఆత్మకూరు వైపు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. వాచ్‌మన్ నిద్ర మేల్కొవడంతో దుండగులు కారులో పరారీ అయ్యారు. పోలీసుల కథనం మేరకు.. మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బంది రోజు మాదిరిగానే వచ్చిన సుమారు రూ.6 లక్షల నగదును కౌంటర్‌లో పెట్టి తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సుమారు 2.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి షెట్టర్ తాళాలు పగలకొట్టి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అలికిడి కావడంతో అక్కడే ఉన్న వాచ్‌మన్ మేల్కొని కేకలు వేయడంతో వారు పరార్ అయ్యారు. వెంటనే జరిగిన సంఘటనను సూపర్‌వైజర్‌కు సమాచారం ఇచ్చారు. అతను ఎస్‌ఐ నాగార్జునరెడ్డితో సంఘటనా స్థలానికి తీసుకెళ్లి పరిశీలించారు. నిందితుల కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోయింది. అనంతరం సీఐ రవినాయక్ వాచ్‌మన్‌ను విచారించి క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. వారు వేలిముద్రలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ఆత్మకూరు, మార్చి 18: మున్సిపాలిటీ పరిధిలోని టి.ముస్తాపురంలో సోమవారం ఉదయం నాదేళ్ల సుబ్బారావుకు చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపకదళ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షల నష్టం వాటిల్లిందని రైతు నాదేళ్ల సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. డీసీపల్లి పొగాకు బోర్డుకు చెందిన ఫీల్డ్‌ఆఫీసర్లు ప్రకాష్, దివ్యలు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. అగ్నిప్రమాదం సంభవించడానికి గల కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6243
వెండి కిలో ధర	రూ. 76,500
వెండి ఒక గ్రాము	రూ. 78.50

వేధింపుల కేసులో ఆరు నెలల జైలు, జరిమానా

సీతారామపురం, మార్చి 18: మండలంలోని చిన్నగంపల్లి పంచాయతీలోని ముత్యాలనగర్ చెందిన నల్లగల్ల యోసుబు తన భార్యను వేధిస్తున్నాడన్న కేసులో నేరం రుజువు కావడవతో ఆయనకు ఆరు నెలలు జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ ఉదయగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు సోమవారం ఎస్‌ఐ అనూష తెలిపారు. 2019లో తనను వేధిస్తున్నాడని భార్య పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నిందుతుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌ఐ అనూష తెలిపారు.

ఉపాధి హామీలో

వసతులకు రాంరాం!



- గతంలో మజ్జిగ.. నీటి సరఫరాకు ఆయాల ఏర్పాటు
- నీడ కోసం టార్పాలిన్ పట్టల పంపిణీ
- గడ్డపార, తట్టలు సరఫరా
- రెండేళ్ల నుంచి అవేమీ ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న కూలీలు
- మండుటెండల్లో పనులు చేసేందుకు ససేమిరా !

సంగం, మార్చి 18 : గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2007లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో రూ.కోట్లతో ప్రతి ఏటా లక్షలాదిమంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ పథకానికి వైసీపీ ప్రభుత్వంలో వసతులు కరువయ్యాయి. గతంలో వేసవి వచ్చిందంటే కూలీలకు పనిచేసే చోట నీడ కోసం టార్పాలిన్ పట్టలు పంపిణీ చేసేవారు. వాటితో నీడను ఏర్పాటు చేసుకుని వడదెబ్బ గురికాకుండా కూలీలు ఉపశమనం పొందేవారు. వీటితో పాటు తాగునీరు...మజ్జిగ సరఫరా చేసేవారు. ఇందుకు ఒక్కొక్క శ్రమశక్తి సంఘానికి ఆయాను నియమించి వేతనం ఇచ్చేవారు. ఉపాధిహామీలో వచ్చిన నూతన సాఫ్ట్‌వేర్‌తో వసతులేవీ కల్పించలేదు. వసతులు లేక ఎండలకు ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యతో చాలామంది పనులకు వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

● ప్రశ్నార్థకంగా గిట్టుబాటు వేతనం

ఈ పథకంలో రోజువారి కూలీ మొదట్లో సుమారు రూ.100లు వచ్చేలా పనులు కేటాయించేవారు. ఈ కూలీ 2009 వరకు ఇలాగే ఉండేది. అయితే పెరుగుతున్న నిత్యవసర వస్తువులతో కూలి కూడా ప్రభుత్వం పెంచుతూ వచ్చింది. 2010-11లో రూ.121లకు పెంచింది. ఆ తరువాత 2012లో రూ. 139లు, 2013లో రూ.149లు, 2014లో రూ.169లు, 2015లో రూ.180లు, 2016లో రూ.194ల, ప్రస్తుతం రోజువారి కనీస కూలి రూ.272లు చొప్పున చెల్లిస్తున్నారు. కానీ వేసవి తాపంతో నేల గట్టిపడడంతో కాలువలో పూడికతీత పనులు సరిగా సాగడం లేదు. దీంతో కూలి గిట్టుబాటు కావడం లేదు.



ఎండలు పెరుగుతున్నాయి

మార్చి నెల వచ్చినప్పటి నుంచి ఎండలు ఎక్కువయ్యాయి.. ఉదయం మంచు, ఎనిమిది గంటలైతే ఎండలు మండిపోతున్నాయి. పనులు జరగడంలేదు. దీంతో కూలి గిట్టుబాటు అవుతుందో లేదో అనుమానంగా ఉంది.

\- వెంకట రమణమ్మ, ఉపాధి కూలి

నేల తెగడం లేదు...

వేసవి ప్రారంభమైంది. ఎండలు ముదిరిపోయాయి. నేలలో తేమ తగ్గిపోయింది. గడ్డపార వేస్తే భూమి లోపలికి దిగడం లేదు. దీనికితోడు ఎండ మండిపోతుంది. ఎంతసేపు పని చేసినా నిర్దేశించిన పని పూర్తి కావడం లేదు. కూలి తక్కువ వచ్చే పరిస్థితి ఉంది. దీంతో చాలామంది కూలీలు పనికి రావడంలేదు.

\- వెంకయ్య, ఉపాధి మేటి



ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే..

ప్రస్తుతం కాలువల పూడికతీత పనులే జరుగుతున్నాయి. చెరువులో పూడికతీత, కుంటల ఏర్పాటు వంటి పనులకైతే నీడ వసతి కావాలి. అలాంటి పనులు జరగడం లేదు. వేసవిలో కూలీలకు మజ్జిగ, తాగునీటి వసతి కల్పించమని ఆదేశాలు వస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తాం.

\- సురేష్, ఇన్‌చార్జి ఏపీవో

6 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలోని 30,523 శ్రమశక్తి సంఘాల్లో ఉపాధి కూలీలకు 6లక్షల జాబ్‌కార్డులున్నాయి. 6.10 లక్షల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. వీరందరూ ఏడాదిలో 150 రోజులు లబ్ధి పొందుతున్నారు.

పథకంలో మార్పులు

ఇటీవల స్థిరాస్తులు కల్పన చేపట్టేలా పథకంలో కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. దీంతో సచివాలయ పరిధిలో జరిగే ఆర్బీకే, హెల్త్ క్లీనిక్, సచివాలయం వంటి భవనాలు మొదలగు సిరాస్తులు కల్పనకు చర్యలు చేపట్టారు. వీటితో కూడా కూలీలకు ఎంతో కొంత ఉపాధి కల్పిస్తున్నారు.

రెండేళ్లుగా వసతులు కరువు

- గతంలో వేసవి వచ్చిందంటే ఉపాధి కూలీలకు వడదెబ్బకు గురికాకుండా పనిచేసే చోట నీడ కల్పించేందుకు టెంట్ల ఏర్పాటుకు టార్పాలిన్ పట్టలు సరఫరా చేసేవారు.
- వేసవిలో భూమిలో తేమశాతం తగ్గిపోయి నేల గట్టి పడుతుంది. నేల తవ్వేందుకు కూలీలు ఇబ్బందులు పడకుండా గడ్డపారలు పంపిణీ చేసేవారు.
- అలాగే వేసవిలో మజ్జిగకు రూ.10, తాగునీటికి రూ.5 అదనంగా ఇచ్చేవారు.
- ఏ చిన్న గాయమైనా ప్రథమ చికిత్స చేసుకోవడానికి కిట్లు ఇచ్చేవారు.
- గత రెండేళ్లుగా ఎటువంటి వసతులు కల్పించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

- పోషకాహార లోపం, రక్తహీనతను నివారించాలి : డీఎంహెచ్‌వో పెంచలయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), మార్చి 18 : జిల్లాలో హైరిస్క్ గర్భిణులను తొలిదశలోనే గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులకు హైరిస్క్ గర్భిణుల జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రక్తహీనత, మధుమేహం, అధిక రక్తపోటు తదితర వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలన్నారు. పోషకాహార ప్రాధాన్యత, సకాలంలో వైద్య పరీక్షల ఆవశ్యకతపై అవగాహన కల్పించితే మాతాశిశు మరణాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ గర్భిణులను సకాలంలో గుర్తించి వారికి వైద్య చికిత్స అందించేందుకు కృషి చేయాలన్నారు. సంక్లిష్టమైన గర్భిణులను పెద్దాసుపత్రికి సిఫార్సు చేయాలన్నారు. నోడల్ అధికారి డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య సంరక్షణతో పాటు ప్రభుత్వం అందించే వైద్య పథకాలపై ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సెలీనాకుమారి, శిక్షణ అధికారి డాక్టర్ పవన్‌రెడ్డి, డాక్టర్ కావ్య, డెమో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లూరులో అక్రమ మైనింగ్ ఇదిగో!

- ఫిర్యాదు చేసి నెలరోజులైనా పట్టించుకోరేం!
- జిల్లా యంత్రాంగంపై టీడీపీ నేత సోమిరెడ్డి ధ్వజం


మొగళ్లూరులో అక్రమ మైనింగ్‌ను పరిశీలిస్తున్న సోమిరెడ్డి, నాయకులు

పొదలకూరు, మార్చి 18 : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతోందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆకస్మికంగా అక్రమ మైనింగ్ జరుగు తున్న ప్రాంతానికి చేరుకుని లోతైన గుంతలు, బ్లాస్టింగ్ ఆనవాళ్లతో ఉన్న అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని మీడియాకు, విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వే నెం.286, 365/6లలో రెండు నెలలుగా జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా గత నెలలోనే 'స్పందన'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వరదాపురంలో రూ.500 కోట్లు, మొగళ్లూరులో మరో రూ.500 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను మంత్రి కాకాణి మైనింగ్ మాఫియా ఎత్తేస్తుంటే అధికారులకు పట్టటంలేదన్నారు. బ్లాస్టింగ్‌తో లోతైన గుంతలు చేయడంతోపాటు కనిపించకుండా మట్టికట్టలు వేసి అక్రమాలకు పాల్పడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అక్రమ మైనింగ్ యథావిధిగా సాగుతోందని సోమవారం కూడా జీపీఎస్ ఆధారిత ఫొటోలతో సహా కలెక్టర్‌కు పంపామన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులను పంపి కలెక్టర్ యాక్షన్ చేస్తున్నారని దుయ్యబట్టారు. మొగళ్లూరులో జరుగుతున్న అక్రమ మైనింగ్ దందాను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. ఆయన వెంట టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు బొమ్మి సురేంద్ర, తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

- జిల్లాకు చేరిన 3.30 లక్షల జవాబు పత్రాలు
- 931 మంది అధ్యాపకుల నియామకం


మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), మార్చి 18 : ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. ఇప్పటికే సంస్కృతం మూల్యాంకనం జరుగుతుంది. నాలుగు విడతలుగా జరిగే ఈ మూల్యాంకనాన్ని ఏప్రిల్ 6వ తేదీకి పూర్తి చేయనున్నారు. 18వ తేదీన ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మేథ్స్, సివిక్స్, 22న ఫిజిక్స్, ఎకనా మిక్స్, 26న కెమిస్ట్రీ, హిస్టరీ, 28న బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్ట్‌లకు మూల్యాంకనం జరుగుతుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 3.30 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. కట్టుదిట్టమైన భద్రత నడుమ జవాబు పత్రాలను స్టోరేజీ పాయింట్‌లో భద్రపరిచి మూల్యాంకనం సమయానికి అధికారులు అందచేయనున్నారు. అన్ని సబ్జెక్టులకు కలిపి 931 మంది అధ్యాపకులను నియమించారు. వీరంతా ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించనున్నారు. ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేలా ఆదేశాలు జారీ చేశారు. స్పాట్ కేంద్రాల్లో ఎవరూ సెల్ ఫోన్ వినియోగించరాదని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కట్టుదిట్టంగా నిర్వహణ

ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం కట్టుదిట్టంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌బోర్డు అధికారులు, అధ్యాపకులతో ఆయన సమీక్షించి మాట్లాడారు. స్పాట్ కేంద్రాల్లోనే స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరతగతిన పూర్తి చేసేలా ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ శ్రీకారం చుట్టారన్నారు. దీనికి సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది సహకరించి స్పాట్‌ను విజయవంతం చేయాలన్నారు. మూల్యాంకనానికి ఇంటర్‌బోర్డు నియమించిన లెక్చరర్లను తప్పనిసరిగా యాజమాన్యాలు రిలీవ్ చేయాలన్నారు. లెక్చరర్స్‌ను పంపని ప్రిన్సిపాళ్లు రోజుకు రూ.వెయ్యి అపరాధ రుసుము చెల్లించాలని, అవసరమైతే కళాశాల అనుమతులు కూడా రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామన్నారు.

కాయ్ రాజాల కాలం ఇది. ఓ పక్క ఎన్నికల హడావుడి.. మరోపక్క ఐపీఎల్ క్రికెట్ టోర్నీ నేపథ్యంలో జూదగాళ్ల కళ్లు అమాయకుల మీద పడుతున్నాయి. ధనాశ చూపి తమ వలలో వేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో వారి గెలుపోటములపై జోరుగా పందేలు కాస్తున్నారు. మరోవైపు 22వ తేదీ నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో ఓవర్ టు ఓవర్.. బాల్ బాల్‌కు పందెం కాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కాయ్‌రాజా కాయ్!

క్రికెట్ మాఫియా జోరు



- ఓ వైపు ఎన్నికలు, మరోవైపు ఐపీఎల్
- అభ్యర్థుల గెలుపోటములపై అగ్రిమెంట్లు

నెల్లూరు (క్రైం), మార్చి 18 : దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై పందెంరాయుళ్ల పందేలు ప్రారంభమయ్యాయి. ఏ నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరు? ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు.. మెజారిటీ ఎంత? రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారు? తదితర అంశాలపై బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఇదిలాఉంటే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో బాల్‌బాల్‌కు బెట్టింగ్ కాసేలా ప్రత్యేక యాప్‌లు రూపుదిద్దుకున్నాయి. బెట్టింగ్ కోసం టీమ్‌లను, కార్యాలయాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వేసవిలో అటు ఎన్నికలు.. ఇటు ఐపీఎల్ మ్యాచ్‌లు పూర్తయ్యేనాటికి ఎందమంది జీవితాలు నాశనం అవుతాయో!. అధికారులు పందేలపై నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

● ప్రత్యేక యాప్‌లు

ప్రస్తుతం బెట్టింగ్ కొత్త రూపు దాల్చింది. గతంలోలాగా ఓ ప్రాంతంలో ఉండి నగదును నేరుగా ఒకరితో ఒకరు ఎదురుగా పెట్టుకొని బెట్టింగ్ కాసే పరిస్థితులు ఇప్పుడు లేవు. పందెరాయుళ్లు హోటళ్లలో కూర్చుని ఈ మ్యాచ్‌కు ఇంత, ఈ వోవర్‌కు ఇన్ని రన్స్, ఈ బాల్‌కు ఇంత స్కోర్ అంటూ నేరుగా నగదు పంపే పరిస్థితులు కూడా బాగా తగ్గాయి. నేడు టెక్నాలజీ పరుగులు తీస్తుండటంతో బెట్టింగ్ విధానంలోనూ మార్పులు వచ్చాయి. ప్రత్యేకంగా క్రికెట్ బెట్టింగ్‌ల కోసం యాప్‌లు సిద్ధమయ్యాయి. దీంతో ఫోన్ ద్వారా నేరుగా బెట్టింగ్ సాగుతోంది. బెట్టింగ్ నిర్వహించేవారు యాప్‌ల వివరాలు తెలిపి ముందుగా అడ్వాన్స్‌గా రూ.5వేల నుంచి రూ.లక్షలు వరకు వేయాలని సూచిస్తారు. ఆ నగదును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపాలని నెంబర్లు ఇస్తారు. నగదు జమైన తర్వాత బెట్టింగ్‌కు అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో బాల్ బాల్‌కు బెట్టింగ్ కాసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కొన్ని ప్రత్యేక యాప్‌లు బెట్టింగ్ కోసమే అన్నట్లుగా ఉన్నాయి. బెట్టింగ్ మత్తులో పడి యువత లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు.

● ఎన్నికల పందేలే వేరు..

కాలం మారుతున్నా, టెక్నాలజీ పెరుగుతున్నా ఎన్నికలపై బెట్టింగ్ కాసేవారు మాత్రం పాత విధానాలనే అనుసరిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నియోజకవర్గాల్లో అభ్యర్థుల జయాపజయాలపై జిల్లా వాసులు జోరుగా పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది... ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి... ఎంపీ సీట్ల లెక్కలపై, అభ్యర్థుల మెజారిటీపై పందేలకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోనూ ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు... టీడీపీ నాయకుల గెలుపుపై కూడా అధికంగా బెట్టింగ్‌లు కాస్తున్నారు. వైసీపీ అభ్యర్థి గెలుపుపై రూ.లక్ష పందెం కాస్తే, రూ.2లక్షలు ఇస్తామని పల్లెల్లో పందేలు సాగుతున్నాయి. పందెపురాయుళ్లు పెద్దమనుషుల సమక్షంలో ప్రామిసరీ నోట్ రాసుకొని ముందుగా నగదును వారి వద్దే ఉంచుతున్నారు. కొందరు పొలం కాగితాలు, ఇళ్ల పట్టాలు, కార్లు, గొర్రెలు, ఆవులు, గేదెలను సైతం బెట్టింగ్ కాస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పందేలు ఏ స్థాయికి వెళతాయో చూడాలి.

బార్ వద్ద పలువురిపై దాడి

- ఎమ్మెల్యే అండతో వీధిరౌడీల్లా చోటా నేతలు

కావలి రూరల్, మార్చి18: ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చినా మాకేంటి భయం.. అంటూ ఎమ్మెల్యే అనుచరుడైన వైసీపీ చోటా నేత పలువురిపై దాడి చేశాడు.ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు, కావలి కి చెందిన వైసీపీ చోటా నేత హనీఫ్, అతడి స్నేహి తుడు విష్ణు, మరో వ్యక్తి రైల్వేరోడ్డులోని కామేశ్వరి బార్ ఎదురుగా మోటారు సైకిల్‌ను నిలిపారు. అనంతరం సమీపంలోని ఓ దుకాణం వద్ద మద్యం తాగారు. ఆ సమయంలో బార్‌లో నుంచి వచ్చిన వైసీపీ వైస్ ఎంపీపీ పాముంజి రాజయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం వారి మోటారు సైకిల్‌ను అనుకుని నిల్చున్నాడు. దీంతో వారు బండి వద్దకు వచ్చి నా బండిని ఎందుకు అనుకున్నావని దాడికి దిగారు. దీన్ని గమనించిన సుబ్రహ్మణ్యం బంధువు అడ్డురాగా అతనిపై కూడా దాడికి దిగారు. స్థానికులు సర్ది చెప్పగా సారీ చెప్పి వారు వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే అనుచరుడు హనీఫ్ మరో ఇద్దరితో కలసి బార్ వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో గత అను భవాల దృష్ట్యా బార్‌లోకి రావద్దు అని చెప్పిన మేనేజర్ ఉప్పాలరమేష్ హనీఫ్ కంటపడ్డాడు, దీం తో రమేష్‌ను దూషించటంతో ఎందుకు తిడుతున్నావని అడగ్గా, అతనిపై కూడా హనీఫ్ దాడి చేశాడు. విషయం తెలుసుకున్న వైసీపీ బీసీ నేత, బార్ యజమాని నాయుడు శ్రీను అక్కడకు చేరుకుని నిలువరించే ప్రయత్నం చేశాడు. అతడిపై కూడా దాడికి యత్నించటంతో బార్ సిబ్బంది అడ్డుకున్నారు. అక్కడ నుంచి హనీఫ్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాధితుల పైనే ఫిర్యాదు చేశాడు. బాధితులు కూడా హనీఫ్‌పై ఫిర్యాదు చేశారు. కాగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కూడా రోడ్లపై కొట్లాటలు జరగటం పట్టణంలో చర్చనీయాంశమైంది.

ప్రశాంతంగా పది పరీక్షలు

లింగసముద్రం, మార్చి 18: స్థానిక కేఆర్ జెడ్పీ హైస్కూల్, పెదపవని భోగరావు హైస్కూల్‌లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. లింగసముద్రం పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ అధికారి హనుమంతరావు తనిఖీ చేశారు. పెదపవనిలోని పరీక్ష కేంద్రాన్ని గుడ్లూరు సీఐ జీ.సుబ్బారావు, లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు, ఎంఈవో-2 శివకుమార్ తనిఖీ చేశారు. లింగసముద్రం కేంద్రంలో దివ్యాంగ విద్యార్థి సహాయకుడిగా దత్తు వరుణ్‌కుమార్ వ్యవహరించాడు.

కలిగిరి: ఉన్నత పాఠశాలలో 162మందికి 154మంది హాజరయ్యారు. చీఫ్‌గా ఎస్ భీమేశ్వర, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ప్రభాకరరెడ్డి వ్యవహరించారు. ఏపీ మోడల్‌స్కూల్‌లో 201మందిలో 186మంది రాశారు. చీఫ్‌గా లక్ష్మీరెడ్డి, ఉన్నారు.

కొండాపురం: తెలుగు పరీక్షకు 20మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. గరిమెనపెంట, గొట్టిగుండాల ఉన్నతపాఠశాల విద్యార్థులు వింజమూరు పరీక్ష కేంద్రంలో పరీక్ష రాశారు.

చిట్రగుంట : కప్పరాళ్లతిప్పలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల, విశ్వనాథరావుపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో 472మందికి 442 మంది హాజరయ్యారు.

ఆత్మకూరు, మార్చి 18: పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో 777 మంది విద్యార్థుల్లో 749 మంది హాజరయ్యారు. సెయింట్ మేరీస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 201 మంది విద్యార్థులకు 194 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 204 మందికి 199 మంది వచ్చారు. బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 143మందిలో 137మంది విద్యార్థులు పరీక్ష రాశారు. శ్రీనివాస ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో 105మందికి 99మంది, జూనియర్ కాలేజీలో 124మందిలో 120 మంది హాజరయ్యారు. కేంద్రాలను ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు.

చేజర్ల: స్థానిక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాల కేంద్రాలలో 405 మంది విద్యార్థులకు 380మంది హాజరయ్యారు. కేంద్రాలను తహసీల్దార్ కే.గోపికృష్ణ, ఎంపీడీవో కరీముల్లా పరిశీలించారు.

సంగం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 9-30గంటలకు పరీక్ష ప్రారంభమవగా అరగంట ముందుగానే పోలీసులు, పాఠశాలల సిబ్బంది విద్యార్థుల హాల్ టిక్కెట్‌లను పరిశీలించి పరీక్ష హాలులోనికి అనుమతించారు. గురుకులంలో 190మందిలో 7గురు గైర్హాజరయ్యారు. జెడ్పీహెచ్ఎస్‌లో 175మందిలో 7గురు హాజరుకాలేదు. తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో జానికీరామయ్య తెలిపారు.

సీతారామపురం: హైస్కూల్ కేంద్రంలో 137 మందికి 120మంది, ఆదర్శపాఠశాల కేంద్రంలో 175మందిలో 157మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

వరికుంటపాడు: స్థానిక ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 141మంది విద్యార్థుల్లో 139మంది హాజరయ్యారు. బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంధ్రా పరంధామిరెడ్డి పరీక్షా కేంద్రం ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులకు టెంకాయతో దిష్టి తీసి పరీక్షలు రాయాలని ఆశీర్వదించి పంపారు.

ఉదయగిరి రూరల్: స్థానిక ఉన్నత, సెయింట్ మేరీష్, గండిపాళెం జిల్లా పరిషత్, గురుకుల పాఠశాలల్లో 520మంది విద్యార్థుల్లో 17మంది గైర్హాజరయ్యారు.

ఏఎస్ పేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 111మందిలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజర య్యారు. మోడల్‌స్కూల్‌లో 148 మంది విద్యార్థుల్లో ఇద్దరు హాజరుకాలేదు. కేంద్రాల వద్ద విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని సౌకార్యలు కల్పించారు.



లింగసముద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయురాలు



కలిగిరి : పరీక్ష గదిలో విద్యార్థులు



ఆత్మకూరు: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



సంగంలో హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న పోలీసులు

టీడీపీలోకి కండ్రిక సర్పంచి



ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన కండ్రిక సర్పంచి, గ్రామస్థులు

మర్రిపాడు, మార్చి 18: కండ్రిక సర్పంచ్ గుర్రం మాధవి సోమవారం తన భర్త తిరుపాలుతో పాటు మాదాల కృష్ణయ్య, పొలిమేర మస్తాన్‌రెడ్డి, మేకపాటి వెంకటేశ్వర్లు, మూలి రమణారెడితో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నెల్లూరులోని మాజీ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి నివాసంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆనం వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధి ఆనంతోనే సాధ్యమని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రెండు మృతదేహాలకు పోస్టుమార్టం

సంగం, మార్చి 18: రెండు ప్రమాదాల్లోని మృతదేహాలకు సోమవారం పోలీసులు పోస్టుమార్టం చేయించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ అనాథ మృతచెందగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆత్మకూరు మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. వారు మృతదేహాన్ని ఖననం చేశారు. అదేవిధంగా దువ్వూరు కాలువ నీటిలో పడి మృతి చెందిన సూరాయపాలెం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

రేపు పరిచయ కార్యక్రమం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలకేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంకు ఆవరణలో బుధవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌తో పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పాల్గొంటారన్నారు. ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 18: పట్టణంలోని 18వ వార్డులో లక్ష్మమ్మ, పరందామయ్య, 5వ వార్డులో గురువయ్య, 10వ వార్డులో శంకరరెడ్డిలు కొన్నిరోజుల కిందట వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి వారి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారుడి ఫిర్యాదుపై విచారణ

వింజమూరు: స్థానిక శుభోదయం గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు డోర్ డెలివరీకి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారని వైశ్య బజార్‌కి చెందిన కొండ మల్లి కార్జున్ అనే వినియోగదారుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం ఆర్ఐ మీరా బాషా గ్రామంలో విచారణ చేపట్టారు. గ్యాస్ ప్రస్తుతం ధర రూ.870 అయితే రూ.900 వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఉన్నతా అధికారులకు నివేదిక పంపుతుతామన్నారు.



ఫిర్యాదుపై విచారణ చేస్తున్న అధికారులు

మూలకు చేరిన పారిశుధ్య యంత్రాలు

సీతారామపురం, మార్చి 18: తొమ్మిది సచివాల యాలకు జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి ఫాగింగ్ యంత్రం, హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్, రుతురుమాళ్ల దహనం, పిచ్చిమొక్కలు తొలగించే పరికరాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం వాటిని వినియోగించక పోవడంతో అవి కార్యాలయంలో మూలకు పరిమితమై తుప్పు పడుతున్నాయి. వీటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడం.. పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని సచివాలయాల సిబ్బందే పెదవి విరుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరికరాలు సక్రమంగా వినియో గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సీతారామపురంలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలు

పోరాటంలో మాదిగ యువత భాగస్వామ్యం కావాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): ఎస్సీ వర్గీకరణ కోసం చేసే పోరాటంలో మాదిగ యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఒంగోలు వెళుతున్న ఆయన్ను సోమవారం దుత్తలూరులో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ ఆంకాంక్షను నెరవేర్చేందుకు రిజర్వేషన్ల కోటాలో న్యాయమైన వాటా కోసం పోరాటం చేయాలన్నారు. రాజకీయాలు, జెండాలకతీతంగా జాతి యావత్తును సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అందరితో చర్చించి పోరాటాన్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే వికలాంగుల ఫించన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, పందిటి అంబేద్కర్, గోచిపాతల వెంకటేశ్వర్లు, గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్ పాల్గొన్నారు.



మంద కృష్ణమాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

గురజాల వాసునాయుడుకి పరామర్శ

వింజమూరు, మార్చి 18: పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు గురజాల వాసునాయుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి తెలుగుదేశం జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ వింజమూరులోని గురజాల వాసు నివాసానికి వెళ్లి పరామర్శించాడు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాకర్ల సురేష్ వెంట పార్టీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, గురజాల సుబ్బారావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, మల్లినేని రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసులు, గంగపట్ల హజరత్ ఉన్నారు.



వాసునాయుడుని పరామర్శిస్తున్న కాకర్ల

ఇళ్ల పైనుంచే వెళ్లిన 33/11 కేవీ విద్యుత్ తీగలు

● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో ప్రజలు

ఉదయగిరి, మార్చి 18: నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో తక్కువ ఎత్తులో అనేక దుకాణాలు, నివాసగృహాల పైన 33/11కేవీ మెయిన్‌లైన్ విద్యుత్ తీగలు వెళ్లాయి. వీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు పూసలకాలనీ హరిజనవాడ, దిలావర్‌బాయ్, సినిమాహాలు సెంటర్ తదితర ప్రాంతాలలో గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇంటిపైకి వెళితే చేయి అందే ఎత్తు లో ఉండటంతో ఇళ్లపైకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం తీగలు వెలడుతూ ఉండటంతో ప్రజలు భయాందోళన చెందు తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వివరించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూసలకాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం - విద్యుత్ శాఖ ఏఈ, కుదూస్

పట్టణంలోని బస్టాండ్ సెంటర్ పూసల కాలనీ, హరిజనవాడ ప్రాంతాల్లో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇళ్ల యజమానులు వైర్ల మార్పునకు నిబంధన మేర నగదు చెల్లిస్తే వెంటనే తొలగిస్తామన్నారు.

అగ్రహారంలో కోడ్ ఉల్లంఘన

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించలేదు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా నాయకులకు సంబంధించిన బోర్డులు ఉండరా దన్నారు. సోమవారం వాటిని తొలగించేలా చర్యలు తీసుకొంటామన్నారు.



ప్రారంభించారు కానీ.. తలుపులు తీయలేదు !

లింగసముద్రం, మార్చి 18 : మండలంలోని పెంట్రాల గ్రామంలో ఈనెల 6న నాలుగు ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించారు.కానీ ఈ ఆ కార్యాలయాల సిబ్బంది నేటి వరకు అందులో చేరలేదు. ఈ గ్రామంలో ఆర్‌బీకే, పాల కేంద్రం, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను నిర్మించిన కాంట్రాక్టరు వాటిని అధికారులకు అప్పగించారు. వాటిని ఈ నెల 6న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ప్రారంభించారు.అయితే ఈ భవనాలకు విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. డిజిటల్ లైబ్రరీకి సిబ్బంది కానీ. కంప్యూటర్లు గానీ, ఇతర సదుపాయాలు గానీ లేవు. దీన్ని మహిళా సంఘాలు వినియోగించుకోవాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. కాగా ఈ కార్యాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో యు శేషుబాబు తెలిపారు.



పెంట్రాలలో ప్రారంభోత్సవం అనంతరం మూతపడిన ప్రభుత్వ కార్యాలయాలు

కనిగిరిలో బుర్రాను తిరస్కరిస్తే ఇక్కడకు పంపారు!

కందుకూరు, మార్చి 18: కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పెద్ద అవినీతిపరుడని, అక్రమాలు, భూకబ్జాలతో రూ.కోట్లు దోచుకున్నాడని టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. బుర్రాను ఓడించి తీరుతామని కనిగిరి ప్రజలు హెచ్చరించటంతో జగన్మోహనరెడ్డి ఆయన్ను కందుకూరు పంపారని ఆయన ఆరోపించారు. నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి సోమవారం ఆయన టీడీపీ కార్యాలయానికి వచ్చి స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బుర్రా మధు వ్యవహారశైలి కారణంగా కందుకూరులో రాజకీయ వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, చల్లా శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు.

● **శివరామకృష్ణకు పరామర్శ**

కందుకూరులో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి గాయపరచిన కనమర్లపూడి శివరామకృష్ణ కుటుంబ సభ్యులను ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. అక్కడి నుంచే పోలీసు అధికారులతో మాట్లాడారు. శివరామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

● **కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటా...**

'టీడీపీ అభివృద్ధే ధ్యేయంగా ఊరూరా తిరిగి పనిచేశాం... కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపటంకోసం శాయశక్తులా పనిచేశాం... అయితే అభ్యర్థి ఎంపిక విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నందున వారి అభిప్రాయాలు తెలుసుకుని అందుకనుగుణంగానే నడుచుకుంటాం'.. అని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి రాజేష్ కార్యాలయంలో టీడీపీ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. మున్సిపల్ మాజీ ఛైర్మన్ బూర్సు మాలకొండయ్య, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సోదరుడు దివి రమేష్, మాజీ ఎంపీపీ సలహాదారు పొడపాటి శ్రీను, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు ఆవుల నరసింహారావు, మర్రిబోయిన వెంకయ్య, పెనుగొండయ్య, పొడపాటి వంశీ, తానికొండ అంజనేయులు, ఇంటూరి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు మంచి అవకాశాలు ఉన్నా అభ్యర్థి ఎంపిక విషయంలో అందరు నాయకుల అభిప్రాయం, ప్రజాభిప్రాయం తీసుకోకుండా పార్టీ ఏకపక్షంగా అభ్యర్థి ప్రకటన చేసిందన్నారు. ఈ విషయంలో పునః సమీక్ష చేయాలని అభిప్రాయపడ్డారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, పక్కన రాంభూపాల్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు

● **రాజేష్‌తో నేతల భేటీ**

అంతకుముందు నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయరు రూప్‌కుమార్ యాదవ్‌లు ఇంటూరి రాజేష్ కార్యాలయానికి చేరుకుని ఆయనతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపిక జరిగిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇక్కడి పరిస్థితులను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, వారం రోజులు సమయం ఇవ్వాలని వారు కోరారు.

ఆర్టీసీ కార్మిక నాయకుడు మస్తాన్ మృతి



కావలి టౌన్, మార్చి 19: ఆర్టీసీ ఎస్ఎంయూ జిల్లా నాయకుడు ఎస్‌కే మహబూబ్ మస్తాన్ (59) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మస్తాన్ మరణంతో సోమవారం ఆర్టీసీ అధికారులు, కార్మికులు సంతాపం తెలిపారు. డీఎం రావూరు శ్రీనివాసులు, ఎస్ఎంయూ నాయకులు రఘునందనరెడ్డి, కార్గో ఇన్‌చార్జ్ రవిప్రకాష్ తదితరులు మస్తాన్ మృతికి సంతాపం తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే మస్తాన్ మృతి బాధాకరమని స్నేహితులు పేర్కొన్నారు.

248 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మార్చి 18: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 260పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 248బేళ్లు కొనుగోలు చేశారు. సీఆర్-7, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 12బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230, కనిష్ఠ ధర రూ.223, సగటు ధర రూ.229.66గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ అదాలత్ వాయిదా

లింగసముద్రం, మార్చి 18: లింగసముద్రంలో మంగళవారం నిర్వహించాల్సిన విద్యుత్ అదాలత్ వాయిదా వేసినట్టు కందుకూరు విద్యుత్ ఈఈ ఏ వీరయ్య తెలిపారు.ఎన్నికల కోడ్ కారణంగా ఈ అదాలత్‌ను వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.

వ్యక్తిగతంగా సహకరించి ఓటు వేయండి



గిరిజనులను ఓటు అడుగుతున్న విష్ణు

అల్లూరు, మార్చి 18 : రానున్న ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నారని, వ్యక్తిగతంగా సహకరించి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు పట్టణంలోని సింగారెడ్డిదిన్నె, బూదురుగుంట, యర్రప్పగుంట గిరిజన కాలనీల్లో ఆయన తన సతీమణి శివప్రియతో కలిసి సోమవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాను పోటీచేసే ఎన్నికల గుర్తు త్వరలో తెలియజేస్తానన్నారు. తాను ప్రతి ఒక్కరికి సహకారాన్ని అందించి ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, ఆరుగుంట శశిరెడ్డి, బూదరు శీనయ్య, లక్ష్మణరాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం.. !



అల్లూరు, మార్చి 18 : మన ఓటు మనమే వేసుకుందాం... అనే నినాదంతో కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ప్రచారం చేపట్టారు. సోమవారం అల్లూరు మండలంలోని గ్రద్దగుంట, బట్రకాగొల్లు, నార్తుఆములూరు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోవూరు బాబు, కావూరు బంగారయ్య, కప్పల నవీన్ కుమార్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం !

బిట్రగుంట, మార్చి 18: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని ఆర్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం క్లీన్‌అండ్‌గ్రీన్‌లో భాగంగా గౌరవరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, సర్పంచు రాధిక, అంగన్‌వాడీ కార్యకర్త మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ దందాను అడ్డుకోవాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత నేతలు, తదితరులు

కావలి, మార్చి18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కూడా అధికారపార్టీ నేతల గ్రావెల్ దందా ఆగలేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. అక్రమ దందాను నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం దళితనేతలు ఆర్డీవో కార్యలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆములూరు, తిప్ప, బుడంగుంట తదితర ప్రాంతాల్లోని బడుగుల భూముల్లో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకుని రూ.కోట్లు గడిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, తహసీల్దార్, వీఆర్వోలు పట్టించుకోక పోవటంతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుందన్నారు. గ్రావెల్ మాఫియాను అరికట్టకపోతే తాము ఈసీ దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో కోవూరు బాబు, సాల్మన్, కాకి వెంకయ్య, జడ్డా వాసు, బంగారయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీల కోసం కావ్యను విమర్శిస్తే ఊరుకోం : టీడీపీ

కావలి, మార్చి18: ప్యాకేజీల కోసం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని టీడీపీ నేతలు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాయకులు ఉప్పుటూరు బాలగురుస్వామి, జ్యోతిబాబూరావు, చవల రామకృష్ణ, దావులూరి దేవకుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు, తిరువీధి ప్రసాద్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అరాచకాలు, విధ్వంసక పాలనను సాక్ష్యాధారాలతో సహా రుజువు చేయగలమన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం కావటంతో దాన్ని జీర్ణించుకోలేక ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. ప్యాకేజీలు తీసుకుని ఎవరంటే వారు సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకుని వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ఆత్మకూరు నాగరాజు, తటవర్తి వాసు, షేక్ మస్తాన్, గుండ్లపల్లి శివాజీ, కోట రమేష్, ఏటూరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

జాతీయ సాంకేతిక పోటీల్లో 'ప్రకాశం'కు బహుమతులు

కందుకూరు, మార్చి 18: ఒంగోలు సమీపంలోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండురోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక పోటీల్లో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రెండు విభాగాలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎన్ మీరావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈఈ మూడవ సంవత్సరం విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్ ఆలంబనగా రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన టెక్నాలజీతో రూపొందించిన ప్రాజెక్టు ఎక్స్ పోకు ఆర్. తనూజ, కె. వినోద్‌లు ప్రథమ బహుమతిని అందుకున్నారన్నారు. అలాగే టీ. సౌజన్య, జీవీ శ్రావణిలు రూపొందించిన సౌండ్ బ్యాటరీ పత్ర విశ్లేషణ ద్వితీయ బహుమతిని అందుకున్నారు. అలాగే మెకానికల్ విభాగం విద్యార్థులు నానో రోబో టెక్నాలజీతో రూపొందించిన పత్ర విశ్లేషణలో రోబోకు ద్వితీయ బహుమతి లభించిందని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీ నివాస్‌లు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

● **ఘనంగా వార్షికోత్సవం**

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బుల్లితెర నటులు, యాంకర్స్ శరత్, సౌమ్యలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామయ్యను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీ నివాస్‌లు నర్సింగ్ కళాశాల నిర్వాహకురాలు డాక్టరు కంచర్ల ఇందిరాదేవి, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



బుచ్చిలోని జడ్పీ బాలికల హైస్కూలు పరీక్ష కేంద్రం ముందు వేచివున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18: బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీతోపాటు మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలలో సోమవారం 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. మొత్తం 1004 మంది విద్యార్థులకు గాను 115మంది గైర్హాజరైనట్లు సీఆర్పీ మల్లేశ్వరరెడ్డి తెలిపారు. కాగా, ఎండ తీవ్రతకు బయట ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్షలు రాసిన తరువాత బస్టాండ్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు.

మనుబోలు, మార్చి 18: స్థానిక జడ్పీ హైస్కూల్‌లోని రెండు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటుచేశారు. స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి పంపారు. బాలి కల హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చీఫ్‌గా వసంత కుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శ్రీహరి వ్యవహరించారు. బాలుర హైస్కూల్లో 43 మంది గైర్హాజరయ్యారు. డిపార్ట్ మెంట్ ఆఫీసర్‌గా డివిడి కుమార్ వ్యవహరించారు.

వెంకటాచలం: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వెంకటాచలం, చెముడుగుంట, సర్వేపల్లి, నిడిగుంటపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న రవీంద్ర భారతీ పాఠశాలలో పరీక్షా కేంద్రాల్లో మొత్తం 998 మంది విద్యార్థులకు గాను 39 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

సైదాపురం: మండలంలోని సైదాపురం, కలిచేడు గ్రామాల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్‌ఐ విజయ్‌కుమార్ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు.

మనుబోలమ్మకు స్వర్ణ కవచాల బహూకరణ



స్వర్ణ కవచాలతో అమ్మవారు

మనుబోలు, మార్చి 18: గ్రామదేవత మనుబోలమ్మకు సోమవారం మనుబోలు గ్రామానికి చెందిన చెన్నూరు కోదండరామిరెడ్డి, అనసూయమ్మ, చెన్నూరు సునీల్, అజిత దంపతులు సుమారు రూ.2 లక్షలు విలువచేసే స్వర్ణ కవచాలను బహుకరించారని ఆలయ అర్చకులు సాయిశర్మ తెలిపారు. అమ్మవారికి పంచామృత అభిషేకములు నిర్వహించి స్వర్ణ కవచాలతో అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

బుచ్చిలో పోలీసు కవాతు



బుచ్చిలో బీఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించినట్టు సీఐ హైమారావు తెలిపారు. 70మంది బీఎస్‌ఎఫ్ పోలీసులతో బుచ్చి పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్, జాతీయ రహదారి మీదుగా సమస్యాత్మక ప్రాంతాలు దామరమడుగు, పెనుబల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా పోలీసుల సహకారంతో వినియోగించుకునేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్టు సీఐ తెలిపారు.

కూల్‌డ్రింక్ షాపుల్లో మద్యం విక్రయాలు

● పట్టించుకోని సెబ్ అధికారులు

తోటపల్లిగూడూరు, మార్చి 18 : కూల్ డ్రింక్ షాపుల్లో యదేచ్ఛగా మద్యం విక్రయాలు చేస్తున్నా సెబ్ అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నరుకూరు, మహాలక్ష్మీపురం, కోడూరు, సాలిపేట సెంటర్లలో ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహిస్తోంది. ఈ షాపులకి ఆనుకుని ఉన్న కూల్‌డ్రింక్ షాపుల్లో కూడా మద్యం విక్రయిస్తుండడంతో మందుబాబుల ఆగడాలతో కోడూరు సాగర తీరంలో వేళాంగిని మాత చర్చికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సెబ్ అధికారులు స్పందించి కోడూరులో మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో వైసీపీ : సోమిరెడ్డి



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో సోమిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

పొదలకూరు, మార్చి 18: ప్రజాగళం భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో రాష్ట్రంలో వైసీపీకి దిక్కుతోచని స్థితి దాపరించిందని, వారి ఓటమి కళ్లకు కనిపించిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సత్యనారాణ పట్టణంలోని సత్య నారాయణ ట్రేడర్స్ లేఅవుట్, అగచాట్లపురం కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఇంటింటికి పంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని, లేదంటే ఎలక్షన్ కమిషన్ ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. సర్వేపల్లిలో కాకాణి దోచుకున్న సొమ్మంతా అధికారంలోకి రాగానే కక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, జమీర్‌బాషా, రాజా, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డికి వైసీపీ నేతల మద్దతు



ఊటుకూరులో వేమిరెడ్డికి మద్దతు తెలుపుతున్న విజయభానురెడ్డి తదితరులు

విడవలూరు, మార్చి 18: నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మండలంలోని ఊటుకూరు, విడవలూరుకు చెందిన వైసీపీ నాయకులు మద్దతు తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఎన్నికల సందర్భంగా మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఊటుకూరుకు చెందిన వైసీపీ నాయకులు దామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, విడవలూరుకు చెందిన పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పూండ్ల హరిరెడ్డి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవూరు అభ్యర్థిగా బరిలో ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, కోడపాటి మహేష్‌బాబు, తాటిపర్తి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి చేస్తాం!



కొడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రవీణ్

కొడవలూరు, మార్చి 18: కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని మాజీ టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట దక్షిణ హరిజనవాడ ఉపసర్పంచ్ కె నవీన్, నియోజకవర్గ బీసీ సెల్ రాజగోపాల్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ప్రశాంతిరెడ్డిని కలిసిన బొద్దుకూరు

ఇందుకూరుపేట : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సోమవారం మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దుకూరు సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో టీడీపీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వెంకటాచలం, మార్చి 18: విద్యార్థులు తరగతి గదుల బయట నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, దానికి జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఒక మంచి ప్లాట్‌ఫామ్ అని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్ కుమార్ బాబు అన్నారు. వీఎస్‌యూలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏడురోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వ్యక్తిత్వ వికాసం మెరుగుపర్చుకోవడానికి సహాయపడుతుందన్నారు. విద్యార్థులందరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కే విద్యాప్రభాకర్ తదితరులున్నారు.

ఫాల్గుణ పూర్ణిమ విశిష్టతపై గ్రామాల్లో ప్రచారం

వెంకటాచలం, మార్చి 18: మండలంలోని నిడిగుంటపాళెం, దర్బలమిట్ట, పుంజులూరుపాడు, గుడివాడతోపు, ములకలపూడి, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫాల్గుణ పూర్ణిమ విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డి సురమౌళి, సభ్యులు ప్రదీప్, విజయమ్మ, కృష్ణ, మౌళి, శ్రీదేవి, అవినాష్, శేఖర్, వేణు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కూసినా

తొలగని పార్టీల ఫ్లెక్సీలు, ఫొటోలు



ముసుగు వేయకుండా ఉన్న శిలాఫలకం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18: ఎన్నికల కోడ్ కూసి మూడు రోజులైనా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు, ఫోటోలు, విగ్రహాల తొలగింపు ప్రక్రియ నత్తనడక సాగుతోంది. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో సోమవారం సాయంత్రం బుచ్చి కొత్తబస్టాండ్ సెంటర్ వెలుగు కార్యాలయ ఎదురుగా, బస్టాండ్ సెంటర్లో వున్న సీఎం జగన్, ఎమ్మెల్యే ప్రసన్న, ఫోటోలకు ముసుగులు వేశారు. కాగా, మండలంలో బుచ్చి బస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహం కింద దిమ్మ చుట్టూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫోటోలు దర్శనమిస్తుండడం చర్చనీయాంశమైంది.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

కనుపూరు కాలువను

తవ్వేస్తున్నారు!



ఆమంచర్లలో కనుపూరు కాలువ కరకట్ట కింద తవ్విన గుంతలు

ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేసినా స్పందించని రెవెన్యూ, పోలీసు

నెల్లూరు రూరల్, మార్చి 18 : మండలంలోని ఆమంచర్లలో ఓ అధికార పార్టీ నేత కనుసన్నల్లో నాలుగు మండలాలకు సాగునీటి సరఫరాకు ప్రధాన వనరుగా ఉన్న కనుపూరు కాలువ కరకట్టలను తవ్వేశారు. అప్పటికీ దాహం తీరకపోవడంతో కట్ట కింద కాలువ పోరంబోకు భూములను సైతం తవ్వేస్తున్నారు. పగలంతా ఇరిగేషన్ అధికారులు కాలువపై ఉండడంతో రాత్రుళ్లు తవ్వకాలకు పదునుపెట్టి తవ్వేసిన మట్టిన సమీపంలోని రియల్ వెంచర్లకు తోలేస్తున్నారు. ఇలా ఒక రాత్రి సుమారు 300 ట్రిప్పుల ట్రాక్టర్ల మట్టిన తరలించేస్తున్నారు. ఈ విధంగా రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్న వైసీపీ నాయకులు శాఖల వారీగా అధికారులకు వాటాలివ్వడంతో ఏ అధికారి అటువైపు కన్నెత్తైన చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక గ్రామస్థుల జోక్యంతో రంగంలోకి దిగిన ఇరిగేషన్ అధికారులు తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వారేవ్వరి నుంచి కనీస స్పందన రావడంతోలేదని ఇరిగేషన్‌లోకి ఓ అధికారి తెలిపారు. తానే స్వయంలో తహసీల్దారుకు ఫోన్ చేస్తే సమాధానం కూడా లేదని వాపోయారు. ఇక పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించినా కన్నెత్తి కూడా చూడటం లేదని తెలిపారు. దీనిని బట్టి ఇక్కడ తవ్వుతున్న మట్టిలో ఆయా శాఖలకు ఎంత లెక్క ముడుపులు అందుతున్నాయో అర్థమవుతోంది. ఇలానే తవ్వకుంటుపోతే కనుపూరు కాలువ కట్టల భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

● వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



పోలంరెడ్డి కుటుంబంతో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 18 : కోవూరు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటాని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నగరంలోని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి నివాసానికి సోమవారం వేమిరెడ్డి దంపతులు వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో శ్రీనివాసులరెడ్డి, దినేష్‌రెడ్డి సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించామన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నన్ను గెలిపిస్తే కోవూరును, జిల్లాను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు ప్రశాంతిరెడ్డికి సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలుపునకు శ్రమిస్తా మని చెప్పారు.

రేపు ఆత్మీయ సమావేశం

కోవూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఈ సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్సీ వాకాటి భేటీ

టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులతో సోమవారం వారి నివాసంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి భేటీ అయ్యి వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పీ.సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ శీనయ్య మద్దతు

బేరి వైశ్య సంఘం కార్యదర్శి మార్కెట్ శీనయ్య సోమవారం సుమారు 300 మందితో భారీ ర్యాలీగా టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. వీపీఆర్‌ను సత్కరించి మద్దతు తెలిపారు.

కూటమికి అండగా నిలవండి

● టీడీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ



ప్రచారంలో పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 18 : రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అండగా నిలవాలని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ కోరారు. సోమవారం 16వ డివిజన్‌లో బాబూష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. దేశ, రాష్ట్రాభివృద్ధి కూటమితోనే జరుగుతుందని వెల్లడించారు. నెల్లూరు నగరంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటిని విస్మరించిందని పేర్కొన్నారు. కేవలం 10 శాతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసిఉంటే నేడు దోమల స్వైరవిహారం ఉండేది కాదన్నారు. మరో రెండు నెలల్లో వచ్చే టీడీపీ ప్రభుత్వంలోనే వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాగళం విజయవంతంతో వైసీపీలో వణుకు : కోటంరెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), మార్చి 18 : చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం విజయవంతం కావడంతో వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం 9వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గత టీడీపీ ప్రభుత్వంలో పొంగూరు నారాయణ చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. అండర్‌గ్రైండ్ డ్రైనేజీ పూర్తవ్వాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. నెల్లూరు సిటీలో తాగునీటి పథకం వైసీపీ నిర్లక్ష్యం వల్లే వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కువ్వారపు బాలాజీ, పాకాల పెంచలయ్య, కొండ్రగుంట సురేష్, చంద్రమౌళి, శ్రీకాంత్, సుధాకర్, మంగమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు : ఏడీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), మార్చి 18 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి హెచ్చరించారు. సోమవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, సిద్ధార్థనర్సింగ్ హోం, మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫామ్ ఎఫ్ సక్రమంగా నిరహించాలని, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని, జైలుశిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 18: నగరంలోని రెడ్‌క్రాస్‌లో ఉన్న మాగుంట సుబ్బారామిరెడ్డి స్పాస్టిక్ సెంటర్‌లోని మానసిక దివ్యాంగ విద్యార్థులకు సోమవారం డాక్టర్ అంబేడ్కర్ సొసైటీ ఫర్ యూత్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. వార్షికోత్సవం కార్యక్రమాలు వారం రోజులుగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ బొమ్మల బాలచెన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామయ్య, గోడ పెంచలమ్మ, డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రజల ఆకాంక్ష

● టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి



కోటంరెడ్డి సోదరులను గజమాలతో సత్కరిస్తున్న పార్టీలో చేరిన నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 18 : చంద్రబాబు సీఎం కావాలన్నదే ప్రజల ఆకాంక్ష అని, ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో 57శాతం ఓట్లతో 160 ఎమ్మెల్యే స్థానాలు, 25 పార్లమెంటు స్థానాలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని టీడీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొండ్లపూడి గ్రామ సర్పంచి కుటుంబ సభ్యులు, వార్డు మెంబర్లు, ఓ వైసీపీ నేత, కొత్తవెల్లంటికి చెందిన మరో వైసీపీ నేత, 12వ డివిజన్ రాజుపాళెం, 17వ డివిజన్ ఆకుతోటకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారందరికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గరిధర్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఒంటేరు విజయకుమార్‌రెడ్డి, వెడిచర్ల రామయ్య, దొడ్డపనేని రాజానాయుడు, జెన్ని రమణయ్య, సాబిర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్ను బకాయిలుంటే

కనెక్షన్ కట్ చేయండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), మార్చి 18 : ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో కుళాయి పన్ను బకాయిలు ఉన్న వారిని గుర్తించి కనెక్షన్ కట్ చేసి నీటి సరఫరా నిలిపివేయాలని ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిదారులకు ప్రభుత్వ వడ్డీ మాఫీతో వెసులుబాటు కల్పించిదన్నారు. ఈ అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేని వారిని గుర్తించి కుళాయి కనెక్షన్ తొలగించాలన్నారు. ఇలాంటి వారు ఎంతమంది ఉన్నారన్నది సచివాలయాల వారీగా గుర్తించాలని చెప్పారు. మరి కొన్ని రోజుల్లో మార్చి నెల ముగుస్తున్నందున పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల విధుల్లో భాగంగా ఏఈఆర్వో, ఇతర అధికారులతో సమీక్షించారు.

అంబేడ్కర్ భవనానికి నిధులు మంజూరు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 18 : నగరంలోని కొండాయపాళెం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మిషన్ జిల్లాశాఖ వర్కింగ్ ఛైర్మన్ వైకుంఠం రామకృష్ణయ్య కోరారు. ఈ మేరకు సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కామంచి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే ఈ భవనంలో దక్షిణం వైపున డాక్టర్ అంబేడ్కర్ మిషన్ కార్యాలయానికి, ఉత్తర భాగంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గదులు కేటాయించాలని కోరారు.

రేపు పెన్షనర్ల సంఘం సమావేశం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 18 : నగరంలోని టౌన్‌హాల్లో బుధవారం సాయంత్రం 4 గంటలకు పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి పీ.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని తెలిపారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

నెల్లూరు(వైద్యం), మార్చి 18 : నగరంలోని కిమ్స్ ఆసుపత్రి గుండె విభాగంలో అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు గుండె వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గుడిమెల్లపాడుకు చెందిన పాపారావు(75) గుండెల్లో నొప్పితో ఆసుపత్రికి వచ్చారన్నారు. పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించగా కాల్షియంతో రెండు బ్లాక్‌లు ఉన్నాయని, వాటిని తొలగిస్తే గాని స్టంట్‌లు వేయడం కుదరదన్నారు. ఈ నేపథ్యంలో ఐవీఎల్ నూతన ప్రక్రియ ద్వారా ధమనుల్లో కాల్షియంను అతిక్లిష్టంగా బ్రేక్‌చేసి స్టంట్‌లు వేశామన్నారు. కేవలం మెట్రో నగరాలలోనే అందుబాటులో ఉన్న ఈ చికిత్స విధానం కిమ్స్ అసుపత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్తు వైద్య నిపుణులు డాక్టర్ నరేష్, డాక్టర్ అశోక్, ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సతీష్‌కుమార్, మెడికల్ అధికారి డాక్టర్ సాహెబ్ పీర్, మెడికల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏవో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొండ్లపూడిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నెల్లూరు(విద్య), మార్చి 18 : వీఎస్‌యూ జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆదేశాల మేరకు నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం కొండ్లపూడిలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. వారం రోజులపాటు జరిగే ఈ క్యాంప్‌లో పలు సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి తెలిపారు. తొలిరోజు ఓటుపై అవగాహన కార్యక్రమం చేపట్టి గ్రామస్థుల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ పి.ఉమామహేశ్వరి, డాక్టర్ వై.దివ్య, డాక్టర్ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ద్రాక్షరసంతో అభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 18 : నగరంలోని పప్పులవీధి ప్రసన్న అంజనేయ స్వామికి మంగళవారం ఉదయం పచ్చ ద్రాక్షా పండ్ల రసంతో అభిషేకం, అర్చన జరుగుతాయని పాండురంగ అన్నదాన సమాజం ఉపాధ్యక్షుడు పాదర్తి బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఎంపీ పేరుతో శిలాఫలకం ఏర్పాటు

సత్యవేడు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులవుతున్నా కొంతమంది అధికారులు ఇంకా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాగలాపురం మండలం సురుటుపల్లె ఆలయంలో ఎంపీ గురుమూర్తి పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ఆలయ ఆవరణలో ఇటీవల రూ. తొమ్మిది లక్షల ఎంపీ నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితమే పనులు ముగిశాయి. వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని సోమవారం సాయంత్రం హడావిడిగా ఏర్పాటు చేశారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీరు!

ఏర్పేడు, మార్చి 18:వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీరు పాల్గొన్నారు. ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీరు మురళి పాల్గొన్నారు. ఓటర్లను అధికార పార్టీ వైపు మళ్లించడానికి వలంటీర్లు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇలాంటివారిపై అధికారులు వెంటనే స్పందించాల్సి వుంది.



డీసీసీబీ చైర్మన్‌తో అంటకాగిన వీఆర్ఏ సస్పెన్షన్

పెళ్లకూరు, మార్చి 18 : రెవెన్యూ పనులను పక్కనబెట్టి డీసీసీబీ చైర్మన్ వ్యక్తిగత సేవలో మునిగి తేలుతున్న చిల్లకూరు వీఆర్ఏ సుజిత్ సస్పెండయ్యారు. నెల్లూరు డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డికి వ్యక్తిగత రక్షకుడిలా ఆయన వెంట ప్రచార కార్యక్రమాల్లో తిరుగుతుండడంతో వీఆర్ఏ సుజిత్‌ను సస్పెండ్ చేస్తూ తహసీల్దార్ కేవీఆర్పీ ప్రసాద్‌రావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.



వైసీపీ అధిష్ఠానానికి నగరి అసమ్మతి నేతల ఝలక్

సీఎంవో పిలుపుతో తాడేపల్లిలో రోజంతా పడిగాపులు

మంత్రి సమక్షంలో మాట్లాడతామనడంతో ఒళ్ళు మండి తిరుగు ప్రయాణం

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో హేమాహేమీల్లాంటి నేతలకు కూడా ఝలక్ ఇస్తున్న అధినేతకే ఆ పార్టీకి చెందిన నగరి నియోజకవర్గ అసమ్మతి నేతలు ఝలక్ ఇచ్చారు.మంత్రి రోజాను నగరి నియోజకవర్గంలో పలువురు మండల స్థాయి వైసీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. రోజాకు టికెట్ ఇవ్వొద్దని వారు ఎంతోకాలంగా అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చారు. ఒకవేళ టికెట్ ఇచ్చినా ఓడిస్తామని హెచ్చరికలు కూడా చేశారు. అయితే అభ్యర్థిని ప్రకటిస్తే అంతా సర్దుకుపోతుందని భావించిన అధిష్ఠానం వీరిని సంప్రదించకుండానే రోజాకే టికెట్ ప్రకటించింది.అయితే అసమ్మతి వర్గం రాజీ పడకపోగా మళ్ళీ మీడియా సమావేశం పెట్టి తమ నిర్ణయంలో మార్పులేదని వెల్లడించారు. ఈ పరిణామంతో ఆందోళన చెందిన అధిష్ఠానం సర్దుబాటుకు ఉపక్రమించింది. ఆదివారం మధ్యాహ్నం అసమ్మతి వర్గ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నుంచీ కబురు వచ్చింది. సోమవారం ఉదయం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి రావాలని కోరారు. దీంతో అసమ్మతి వర్గ నేతలైన శ్రీశైల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర రెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధరరెడ్డి, నింద్ర జడ్పీటీసీ మల్లీశ్వరి భర్త పరంధామయ్య, ఆ మండల వైసీపీ మాజీ కన్వీనర్ మనోహర నాయుడు, సర్పంచ్ జయ్‌రెడ్డి, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై , పార్టీ నేతలు రవిశేఖర్ రాజు, ప్రతాప్, నారాయణబాబు తదితరులు ఆదివారం రాత్రే తాడేపల్లి బయల్దేరి వెళ్ళారు. అయితే సోమవారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయం నుంచీ పిలుపు రాలేదు. సీఎం బిజీగా వున్నారని మధ్యాహ్నం తర్వాత పిలుస్తారన్న సమాచారం వచ్చింది. సాయంత్రమైనా అపాయింట్‌మెంట్ దొరకలేదు. రోజంతా పడిగాపులు పడ్డాక ఈరోజు కలవడం కుదరదని చెప్పడంతో పాటు మంత్రిని కూడా పిలిపిస్తున్నారని, మంగళవారం ఉదయం మంత్రి సమక్షంలోనే మాట్లాడతారన్న సమాధానం వచ్చింది. దీంతో అసమ్మతి నేతలకు చిర్రెత్తుకొచ్చింది. అధిష్ఠానం మీద గౌరవంతో వస్తే ఇలా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వ్యతిరేకిస్తున్న వారితో కలసి సమావేశంలో కూర్చునే ప్రసక్తే లేదని, అధినేత ఆదేశాలను ధిక్కరించినందుకు తమపై ఏ చర్యలు తీసుకున్నా పర్వాలేదని తెగేసి చెప్పి వెంటనే తిరుగు ప్రయాణమయ్యారు.

తెర వెనుక జరిగిందేమిటంటే...

నగరి అసమ్మతి వర్గ నేతలను అధిష్ఠానం తాడేపల్లి పిలిపించినట్టు తెలియని మంత్రి సోమవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసినట్టు తెలిసింది. నగరిలో తనను వ్యతిరేకిస్తున్న నాయకులను పిలిపించి రాజీ కుదర్చాలని పెద్దిరెడ్డిని అభ్యర్థించారని... దానికి పిలిపించడానికి వారు నియోజకవర్గంలో వుంటే కదా... అధిష్ఠానం నుంచీ పిలుపు రావడంతో తాడేపల్లి వెళ్ళారని పెద్దిరెడ్డి సమాధానమిచ్చినట్టు సమాచారం. దీంతో ఖంగు తిన్న మంత్రి వెంటనే తాడేపల్లిలో ముఖ్యులతో మాట్లాడి సోమవారం అసమ్మతి నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఆపించారని, మంగళవారం తన సమక్షంలోనే వారితో మాట్లాడేలా ఏర్పాటు చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మంత్రి రోజా సమక్షంలో అధినేతతో సమావేశం కావడానికి కూడా అసమ్మతి నేతలు అంగీకరించనంతగా ఇరువర్గాల నడుమా అగాధం ఏర్పడిన నేపథ్యంలో దాన్ని పూడ్చడానికి అధిష్ఠానం యత్నిస్తుందో లేక ధిక్కరించి వెళ్ళిన నేతలపై చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాల్సి వుంది. అసమ్మతి నేతలను పట్టించుకోకపోతే వారి కార్యాచరణ ఎలా వుంటుందన్నది ఇపుడు ఆసక్తికరంగా మారుతోంది. నువ్వా నేనా అన్నట్టు పోటాపోటీ రాజకీయాలు నడిచే నగరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యంతోనే అన్నద తెలిసిందే. ఆ నేపథ్యంలో మండలాల్లో ప్రజాబలమున్న అసమ్మతి నేతలు దూరమైతే వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడడం ఖాయం.

టెన్త్ పరీక్షలకు 95.24శాతం హాజరు


పరీక్షలంటే పిల్లలకే కాదు వారి పెద్దలకూ పరీక్షే!

తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్ బయట పిల్లలతో వారి తల్లిదండ్రులు

తిరుపతి(రూరల్), మార్చి 18 : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 162కేంద్రాల్లో తొలిరోజు జరిగిన లాంగ్వేజ్-1 పరీక్షకు 28,415మంది విద్యార్థులకుగాను 27,063మంది విద్యార్థులు హాజరవ్వగా..1,352మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 95.24హాజరు శాతం నమోదైందని డీఈవో శేఖర్ పేర్కొన్నారు.డీఈవో, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ల సిబ్బంది జిల్లాలో 59కేంద్రాలను పర్యవేక్షించారు.

ఓ విద్యార్థినికి అర్ధగంట ఆలస్యంగా అనుమతి

తిరుమల బైపాస్ రోడ్డులోని రత్నం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ఓ విద్యార్థిని (కుంట్రపాకం వర్షిణి) కేంద్రంలోని సిబ్బంది అవగాహనా రాహిత్యంతో బయటకు పంపేశారు. హాల్‌టికెట్‌లో లాంగ్వేజ్-1కి సంబంధించి స్టార్ గుర్తులు ఉండడంతో పరీక్ష రాయాల్సిన అవసరం లేదన్న కారణంతో పంపినట్లు సమాచారం. తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ సిబ్బందికి ఫోన్‌లో వివరించారు. స్పందించిన ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ సంచాలకులు(ఏసీ) గురుస్వామిరెడ్డి కేంద్రం సీఎస్‌కి ఫోన్‌చేసి విద్యార్థిని పరీక్షకు అనుమతించాలని ఆదేశించారు. అప్పటికే అర్ధగంట ఆలస్యమైంది. ఈ విషయమై ఏసీని వివరణ కోరగా హాల్‌టికెట్‌లో పొందుపరచిన స్టార్ గుర్తులతో ఇలా జరిగిందని, సకాలంలోనే విద్యార్థిని పరీక్ష రాసే ఏర్పాట్లు చేశామని వివరించారు.


ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పరీక్షా కేంద్రం వద్ద తాగుబోతు వీరంగం

శ్రీకాళహస్తి, మార్చి 18: టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు.శ్రీకాళహస్తి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం బంగ్లా తోట గ్రామానికి చెందిన మునస్వామి అనే వ్యక్తి మద్యం మత్తులో పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశాడు. పోలీసులు అడ్డుకోగా పరీక్ష రాస్తున్న తన కొడుకును చూడాలంటూ లోపలకు చొరబడబోయాడు. పోలీసులు గట్టిగా మందలించడంతో ఓ రాయి తీసుకుని తలపై కొట్టుకుంటూ కేకలతో వీరంగం చేశాడు. కాసేపటి తర్వాత ప్రభుత్వాస్పత్రిలో చేరి తనను పోలీసులు రక్తం వచ్చేలా కొట్టారంటూ నానాయాగీ చేశాడు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై నేడు గ్రీవెన్స్ సెల్

తిరుపతి(వైద్యం), మార్చి 18- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం తిరుపతిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఉద్యోగులు జీతాలు, ఉద్యోగపరమైన సమస్యలపై అర్జీలను అందిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.


ఓటు హక్కు అవగాహనపై తిరుపతిలో ర్యాలీ

ఎన్నికల కోడ్ అమలుకు 44 బృందాలు

ఉల్లంఘనలపై ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లో చర్యలు

తనిఖీల్లో ఇప్పటి దాకా రూ. 6.50 కోట్ల నగదు సీజ్

కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడి

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు యంత్రాంగం సంసిద్ధంగా వుందని, హింసకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కోడ్ అమలును పర్యవేక్షించడానికి 44 బృందాలను నియమించామన్నారు. అదనంగా 82 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, 70 స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, 31 వీడియో సర్వైలెన్స్ టీములు, 8 వీడియో వ్యూయింగ్ టీములు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు భవనాలు, స్థలాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేసుకున్న వారు ఆయా ప్రాంతాల స్థానిక సంస్థల నుంచీ అనుమతులు తీసుకోకుంటే తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులకు సంబంధించి ఇప్పటి నుంచీ నోటిఫికేషన్ వరకూ గుర్తించే ఖర్చును ఆయా పార్టీల ఖర్చు కింద నమోదు చేయడం జరుగుతుందని, నామినేషన్ల ప్రక్రియ ముగిశాక గుర్తిస్తే అభ్యర్థి ఖాతాలో నమోదు అవుతుందన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లుకు ఎన్నికల ప్రక్రియతో సంబంధం లేదన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఎక్కడైనా అతిక్రమిస్తే ఈసీకి ఫిర్యాదు చేయవచ్చునని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ దీనికోసం సిటిజన్ విజిలెంట్ యాప్ పేరిట యాప్ రూపొందించిందన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉల్లంఘనలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు, వివరాలు అప్‌లోడ్ చేసే అవకాశం వుందన్నారు. ఈ యాప్ ద్వారా చేసే ఫిర్యాదులపై వంద నిమిషాల్లో అంటే గంటన్నర వ్యవధిలోనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలపైన, ఓటు వినియోగంపైన ప్రజలకు అవగాహన కలిగించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో తొలిసారి ఓటరుగా నమోదు చేసుకున్న 36,162మంది యువ ఓటర్లకు ఎన్నికలపై అవగాహన, చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగులు వంటి వారి కోసం సాక్షం యాప్ రూపొందించడం జరిగిందని, దాని ద్వారా దివ్యాంగులైన ఓటర్లు తమకు పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్, ర్యాంప్ వంటివి వున్నాయా లేదా తెలుసుకునే వీలుందన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు.

మూడు కంపెనీల కేంద్రబలగాల రాక

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 4 వేల మంది పోలీసు సిబ్బంది అవసరమని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ వెల్లడించారు.ఇందులో జిల్లాలోనే 2700 మంది అందుబాటులో వున్నారన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం జిల్లాకు మూడు కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ఆత్మస్థైర్యం కల్పించడానికి పోలీసు కవాతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 15 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఇప్పటి వరకూ రూ. 6.50 కోట్ల నగదును సీజ్ చేయడం జరిగిందని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర కూడా పాల్గొన్నారు.

ఓటు హక్కు అవగాహనపై ర్యాలీ

తిరుపతి(కలెక్టరేట్): ఓటరు హక్కులపై అవగాహన కల్పించేందుకు తిరుపతిలో సోమవారం ఎస్వీ యూనివర్శిటీ నుంచి గాంధీ విగ్రహం వరకు స్వీప్ ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ధ్యానచంద్ర, కమిషనర్ అదితిసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా స్వీప్ యాక్టివిటి(సిస్టమేటిక్ ఓటరు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్)పై అవగాహన పెంచి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో స్వీప్ యాక్టివిటీని చేపడుతున్నట్లు తెలిపారు.స్వీప్ నోడల్ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నేతపై అకారణ దాడి

నగరి మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరిపై బీసీ సెల్ అధ్యక్షుడి ఫిర్యాదు - పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు

పుత్తూరు అర్బన్, మార్చి 18: టీడీపీ చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి. సునీల్ సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు.ఈ విషయమై షణ్ముగరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రకారం.... పట్టణంలోని చింతలగుంటలో తుడా నిధులతో పార్కు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కాంపౌండ్ గోడ నిర్మించేందుకు పిల్లర్ల కోసం గుంతలు తీశారు. సోమవారం సాయంత్రం అటు వెళుతున్న షణ్ముగరెడ్డికి కుక్క పిల్ల అరుపు వినిపించడంతో అటు వెళ్లి చూశాడు.పిల్లర్ల కోసం తీసిన గుంతలో కుక్కపిల్ల పడిపోయి ఉండడంతో పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతలో అటు వచ్చిన మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి.సునీల్ పనులకు సంబంధించిన ఫొటోలు తీస్తున్నాడని షణ్ముగరెడ్డిపై దాడి చేశారు. తాను కుక్కపిల్లను బయటకు తీస్తున్నానని చెబుతున్నా వినకుండా రాళ్లతో తనపై దాడి చేశారని , గతంలో కూడా హరి, అతని అనుచరులు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదులో షణ్ముగరెడ్డి పేర్కొన్నాడు.ఈ దాడి విషయం తెలియడంతో టీడీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హరిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టాయి.అదే సమయంలో హరి తన అనుచరులతో స్టేషన్‌కు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో స్టేషన్ పరిసరాలు దద్ధరిల్లాయి. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో పోలీసులు లాఠీలు ఝులిపించాల్సి వచ్చింది. దీంతో పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.




పోలీస్ స్టేషన్ బయట గుమికూడిన టీడీపీ శ్రేణులు - (ఇన్‌సెట్లో) పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న షణ్ముగరెడ్డి తదితరులు

టీడీపీ కార్యకర్త ఇంటిపై ఎస్ఈబీ దాడి

● అక్రమ మద్యం నెపంతో ఆకస్మిక తనిఖీ

శ్రీకాళహస్తి, మార్చి 18: టీడీపీ కార్యకర్త ఇంట్లో ఎస్ఈబీ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. తొట్టంబేడు మండలం శివనాథపురానికి చెందిన రైతు మోహన్ నాయుడు టీడీపీ బూత్ ఇంచార్జిగా వ్యవహరిస్తుంటారు.సోమవారం ఆరుగురు ఎస్ఈబీ అధికారుల బృందం ఆయన ఇంటిపై రైడ్ చేశారు. ఇంట్లో అక్రమ మద్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. చివరకు మద్యం సీసాల ఆనవాళ్లు లభించకపోవడంతో వెళ్లిపోయారు. మహిళా సిబ్బంది లేకుండా ఇంట్లోకి అధికారులు రాత్రివేళ ఎలా చొరబడతారని మోహన్ నాయుడు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎవరో సమాచారం ఇచ్చారని అధికారులు దాడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో మద్యం పెట్టి కూడా తమను ఇరికించే ప్రయత్నం చేస్తారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం):సా. 6.26

సహరి బుధవారం) : ఉ. 4.58

ఎస్వీ జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి


చనిపోయిన పులి (ఫైల్‌ఫొటో)

మంగళం, మార్చి 18: శ్రీవెంకటేశ్వర జూపార్కులో 7 సంవత్సరాల 6 నెలల వయసు ఉన్న మగ బెంగాల్ టైగర్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. 2016వ సంవత్సరంలో ఇక్కడే జన్మించిన ఈ పులి పుట్టుకతోనే కంటి జబ్బుతో బాధపడుతోంది. రెండు కళ్లు క నిపించకపోవంతో నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. కాగా ఈనెల 16న చికిత్స అందించడానికి ప్రయత్నించడంతో అది సహకరించలేదు. 17వ తేదీ రాత్రి 8.30 గంటలకు మృత్యువాతపడిందని, ఎస్వీ యూనివర్సిటీలో వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాని మెదడులో హైపోప్లాసిమా, హైడ్రో సస్రాప్రస్ లెడ్ టు నెఫ్రిట్స్ అనే వ్యాధితో చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

నిమ్మ ధరలు ఢమాల్

గూడూరు అర్బన్, మార్చి 18: గూడూరు మార్కెట్‌లో నిమ్మధరలు అమాంతం పడిపోయాయి. సోమవారం వేలంలో కిలో నిమ్మకాయలు రూ.50తో ప్రారంభమై, గరిష్ఠంగా రూ.70 దాకా పలికాయి. నాలుగు రోజుల క్రితం రూ.95 ధర పలికిన నిమ్మకాయలు అమాంతం తగ్గిపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గూడూరు నిమ్మకు ప్రధాన మార్కెట్ అయిన ఉత్తర భారతంలో వర్షాల కారణంగా మార్కెట్ కుదుపునకు లోనైనట్లు వ్యాపారులు చెప్పడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్‌కు నిమ్మకాయలు పెరుగుతుండడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి తమ ఆదాయానికి గండి కొడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నిమ్మకాయలకు డిమాండ్ ఉన్న రోజుల్లో ఇలా వ్యాపారుల సిండికేట్ దోచుకుంటోందని విమర్శిస్తున్నారు. 4 శాతానికి బదులు 10 శాతం కమీషన్ గుంజేస్తుండడంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్‌టీమ్ సిబ్బంది

నాయుడుపేటలో భారీ చోరీ

రూ.49 లక్షల బంగారు, వెండి ఆభరణాలు, రూ.70 వేల నగదు అపహరణ



దుకాణ షెట్టర్ తొలగించిన దొంగలు

నాయుడుపేట టౌన్, మార్చి 18: నాయుడుపేట పట్టణంలో భారీ చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు... పట్టణానికి చెందిన శివకృష్ణ దర్గావీధిలో జ్యూవెలరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణానికి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణానికి షెట్టర్ తొలగించి ఉండడాన్ని టీ అమ్మే వ్యక్తి గమనించి శివకృష్ణకు తెలియజేశాడు. దుకాణం వద్దకు చేరుకున్న శివకృష్ణ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనాస్థలికి చేరుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి, సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. దుకాణంలో రూ.38 లక్షలు విలువచేసే 50కిలోల వెండి, రూ.11 లక్షల విలువచేసే 22 సవర్ల బంగారు, రూ.70వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు శివకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే పక్కనే ఉన్న ప్రొవిజన్ షాపు షెట్టర్‌ను కూడా తొలగించారు. అయితే ఆ దుకాణంలోకి ప్రవేశించడానికి వీలులేకపోవడంతో చోరీ చేయలేదు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలను అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 18: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక పూలతోట ప్రాంతంలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టివేసిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని సరైన మార్గంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడికే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ప్రవీణ్, సుమన్, తూపిలి సురేంద్ర, బెజవాడ రమేష్, శంకరయ్య, వెంకటరమణ, అమరేంద్ర, ఇంద్రవర్ధన్, భారతి, అమరయ్య, రవీంద్రరెడ్డి, నరసింహులు, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇవ్వండి

చిల్లకూరు, మార్చి 18: తమ భూములకు పరిహారం ఇవ్వాలని చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన రైతులు నెల్లూరులోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు గతంలో ప్రభుత్వం డీకేటీ, సీజేఎఫ్ఎస్ పట్టాలను మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల జగనన్న భూరక్ష పేరుతో రీసర్వే చేసి కొత్త పాస్ పుస్తకాలు అందించారని, అయితే వాటిల్లో డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములు నమోదు చేయలేదన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా విన్నవించగా సదరు భూములను ఏపీఐఐసీకి కేటాయించినట్లు తెలిపారని చెప్పారు. అయితే తమకు ఏపీఐఐసీ నుంచి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలని, లేదా రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

వెంకటగిరి టౌన్, మార్చి 18: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎవరికైనా మనస్పర్థలుంటే పక్కన పెట్టి సమన్వయంతో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. వెంకటగిరి వైసీపీ టికెట్‌పై అసంతృప్తిలు ఉన్నారని వారికి జగన్‌హన్ రెడ్డి విడుదల చేసిన అభ్యర్థులే బరిలో ఉంటారని క్లారిగా తేలిందన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదరుమల్లి రాంకుమార్ రెడ్డిని, తిరుపతి ఎంపీగా మద్దిల గురుమూర్తిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, నెల్లూరు జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ - ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

బాలాయపల్లి, మార్చి 18: బైక్ - ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయాలైన సంఘటన ఆదివారం బాలాయపల్లి మండలం జయంపు సమీపంలో జరిగింది. గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ తన మేనమామ మధు, ఆయన కూతురు ప్రీతి కలిసి ఓజిలి మండలం పాలెంపాడు గ్రామానికి వెళుతుండగా ఆటో ఢీకొంది. ముగ్గురికీ తీవ్రగాయాలు కావడంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో చంద్రముని

సూళ్లూరుపేట, మార్చి 18: ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆర్వో(ఆర్డీవో) చంద్రముని అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎవరైనా కోడ్ ఉల్లగించినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 8 మోడల్ కోడ్ టీమ్, 12 ఫ్లైయింగ్ స్కాడ్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మోడల్ కోడ్ టీమ్స్‌లో ఎంపీడీవోతో పాటు ఒక పోలీసు, వీడియో గ్రాఫర్ ఉంటారన్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎక్కడైనా ఎన్నికల నియమావళిని పాటించకపోతే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకొంటారన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్లు గంగాప్రసాద్, జనార్దనరెడ్డి, తహసీల్దార్లు గోపాలకృష్ణ, ఇక్బాల్, ప్రసాదరావు పాల్గొన్నారు.

సైకోను తరిమికొడదాం: పాశం



గూడలిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీల్ కుమార్, టీడీపీ నాయకులు

కోట, మార్చి 18: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సైకోను ఓటు అనే ఆయుధంతో తరిమికొడదామని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడలిలో సోమవారం రాత్రి శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గూడలి పంచాయతీకి చెందిన రఘునాథ్‌రెడ్డితో పాటు పలువురు వార్డు సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం రావాలంటే టీడీపీ కూటమికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. చీకటిలో మగ్గిపోతున్న ఆంధ్ర రాష్ట్రంలో మళ్లీ వెలుగులు రావాలంటే చంద్రబాబునాయుడు సీఎంగా రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు జలీల్ అహ్మద్, మస్తాన్‌బాషా, తీగల సురేష్‌బాబు, భాస్కర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, మధుయాదవ్, బాలకృష్ణయాదవ్, సురేష్, మురళి, వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, చెంగల్‌రావు, కసుమూరు వెంకటేశ్వర్లు, యల్లశిరి కృష్ణయ్య, పాదర్తి కోటేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



చిల్లకూరులో హల్ టికెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు - నాయుడుపేటలో పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

గూడూరు, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గూడూరు పట్టణంలోని జడ్పీబాలుర, బాలికల, సీఎస్ఎం, సెయింట్ మేరీస్, వివేకానంద, జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మండలంలోని చెన్నూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 7 కేంద్రాల్లో 1385 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 38 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు పరిచారు.

చిల్లకూరు: మండలంలో చిల్లకూరు, తిక్కవరం, వరగలి మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 520 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 460 మంది హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు.

వెంకటగిరి: పట్టణంలోని 7 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 1237 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 77 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వరావు తెలిపారు.

వాకాడు: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 187 మంది విద్యార్థులకు గాను 158మంది హాజరయ్యారని ఎంఈవో నసీమ్ ఆలీ తెలిపారు.

దొరవారిసత్రం: మండలంలోని బీసీ గురుకుల పాఠశాల, ఏకొల్లు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 463 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 39 మంది గైర్హాజరయ్యారు. అలాగే మండలంలోని శ్రీధనమల్లి, ఉచ్చూరు ఉన్నత పాఠశాలల 30మంది విద్యార్థులు సూళ్లూరుపేటలో పరీక్షలు రాస్తున్నారు.

తడ: మండల పరిధిలోని చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, అక్కంపేట ఆదర్శ పాఠశాల, రామాపురం ఉన్నత పాఠశాల, స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 383 మంది విద్యార్థులకు తడ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 305 మంది పరీక్షలు రాయగా 78 మంది గైర్హాజరు అయ్యారు. వాటంబేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సూళ్లూరుపేటలో పరీక్షలు రాశారు.

నాయుడుపేట: పట్టణంలోని నారాయణ, జడ్పీ బాలుర, బాలుర గురుకులం, ఎల్ఏసాగరం జడ్పీ, సెయింట్ మేరీస్, జడ్పీ బాలికల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1359 మంది విద్యార్థులకు గాను 1285 మంది పరీక్షలు రాశారు.

సూళ్లూరుపేట: పట్టణంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1179 మంది విద్యార్థులకు గాను 1082 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 97 మంది గైర్హాజరయ్యారు.

న్యాయం చేయాలని వినతి



తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న రమణమ్మ, స్థానికులు

చిల్లకూరు, మార్చి 18: తమకు ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను సాగుచేసుకోనీయకుండా వీఆర్వో అడ్డుకుంటున్నాడని మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన రమణమ్మ స్థానికులతో కలిసి తహసీల్దారు శ్రీనివాసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త జోగి రమసుబ్బయ్య పేరిట 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం 1.25ఎకరాల భూమిని మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి తాము ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని చెప్పారు. తన భర్త మృతి చెందడంతో మూడేళ్లుగా సాగు చేయడం లేదన్నారు. 20రోజుల క్రితం నుంచి ఆ భూమిలో పంట వేసేందుకు ఉపక్రమించగా వీఆర్‌వో బాలాజీ అడ్డుపడుతున్నారని తహసీల్దారుకు వివరించారు. పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, మార్చి 18: వెంకటగిరిలోని కేజీబీవీ పాఠశాలల్లో 6నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్‌కే.షాహినా భాను సోమవారం తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మేసేజ్ వస్తుందని చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కోట, మార్చి 18: మండల పరిధిలోని విద్యానగర్ బాలభారతీ కూడలి వద్ద సోమవారం కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విద్యానగర్‌కు చెందిన రామకృష్ణారెడ్డి కారులో కోటకు వెళ్తుండగా బాలబారతీ కూడలి సమీపంలో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యార్థులకు అభినందన

కోట, మార్చి 18: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అశోక్‌కుమార్, హర్షద్ 2024 గేట్ పరీక్షలో అర్హత సాధించారు. సోమవారం వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్ షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



కోట, మార్చి18: మండల పరిధిలోని చెందోడు, విద్యానగర్ వద్ద సోమవారం ఓ చుక్కల దుప్పి జనారణ్యంలోకి వచ్చింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక చిట్టేడు, కేశవరం అటవీప్రాంతాల నుంచి తాగునీటి కోసం విద్యానగర్ వైపు వచ్చింది. కుక్కలు వెంబడించడంతో ఎస్‌బీఐ కాలనీలోకి రావడంతో స్థానికులు పట్టుకొని అటవీశాఖ అధికారి రవికుమార్‌కు అప్పగించగా, ఆయన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

పొట్లపూడికి ప్రముఖుల నివాళి

నాయుడుపేట, మార్చి 18: ప్రముఖ వ్యాపారవేత్త, ఆయుర్వేద వైద్యుడు పొట్లపూడి జయప్రదరావుకు సోమవారం ప్రముఖులు నివాళులర్పించారు. సోమవారం నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో జయప్రదరావు ప్రథమ వర్థంతి జరిగింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, షబ్బీర్, భావన్, పాలూరు దశరథరామిరెడ్డి, పేర్నాటి రాహుల్ తదితరులు నివాళులర్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, మార్చి18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది.

వరకట్న వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

వెంకటగిరి టౌన్, మార్చి 18: వరకట్న వేధింపుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ వెంకటగిరి కోర్టు తీర్పు ఇచ్చిందని ఏపీపీ ప్రకృతి కుమార్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చెవిరెడ్డి సుధాకర్ రెడ్డి 2011లో స్వప్న అనే యువతిని వివాహం చేసుకున్నాడు. అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో 2017లో తన భర్త మీద స్వప్న వరకట్న వేధింపుల కేసు పెట్టింది. విచారించిన న్యాయమూర్తి నిందితుడు చెవిరెడ్డి సుధాకర్‌కు మూడు సంవత్సరాలు జైలు, రూ.10వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని సోమవారం తీర్పు ఇచ్చారని ఏపీపీ తెలిపారు.

టీడీపీని గెలిపించండి: విజయశ్రీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 18: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ ని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కలసి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు పేద విద్యార్థుల కోసం విదేశీ విద్య పథకం ప్రవేశపెట్టారని, రాష్ట్రంలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు మంజూరు చేయడంతో పాటు కులవృత్తి దారులకు పనిముట్లను అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, అవధానం సుధీర్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, వాకిరి వెంకటేశ్వర్లు, మొండెం బాబు, రహమాన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు షాపుల ఏర్పాటు

తడ, మార్చి 18: టీడీపీ అధికారంలోకి రాగానే రోడ్డు మార్జిన్‌లో వ్యాపారులకు షాపులను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ చెప్పారు. సోమవారం సాయంత్రం స్థానిక బజారువీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటు వేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాగళం సభ విజయవంతం కావడంతో తెలుగుదేశంపార్టీ విజయం ఖాయమైందన్నారు. వైసీపీకి ఓటమి తప్పదని తెలిసి అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు మురళీరెడ్డి, బొమ్మన శ్రీధర్, పళణి, జయపాల్, జీవ, సుదర్శన్ మొదలియార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోసం కష్టపడినా గుర్తింపు లేదు

బాలాయపల్లి, మార్చి 18: వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసినా గుర్తింపులేదని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శింగంశెట్టి భాస్కరరావు అన్నారు. సోమవారం మండలంలోని జయంపు గ్రామంలోని ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్‌ల ఇళ్లకు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, జడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, జోనల్ కన్వీనర్ శివకుమార్ రెడ్డి వెళ్లారు. అసంతృప్తి వీడి ఎన్నికల్లో కలసి పనిచేద్దామంటూ బుజ్జగించారు. ఎంపీపీ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి నియమితులయ్యాక తమకు ప్రాధాన్యం లేదని, అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నామని వివరించారు. రెండ్రోజుల్లో మంత్రి పెద్దిరెడ్డితో కలిసి మాట్లాడదామని ఎంపీ చెప్పినట్లు తెలిసింది.

సాగు భూములకు హద్దులు చూపండి

కోట, మార్చి 18: తమ ఆధీనంలో ఉన్న భూములకు హద్దులు చూపాలంటూ చెందోడు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు సోమవారం తహసీల్దారు నాగరాజరావుకు వినతిపత్రం అందజేశారు. చెందోడు గ్రామానికి చెందిన 5 కుటుంబాలకు 50 సెంట్ల చొప్పున ప్రభుత్వం భూములు ఇవ్వడం జరిగిందని, ఆ భూములకు హద్దులు చూపకపోవడంతో స్థానికంగా ఉన్న భూస్వాములు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూములకు హద్దులు చూపి రక్షణ కల్పించాలని తహసీల్దారును కోరారు.

అవమానాల వల్లే టీడీపీని వీడాం: వేనాటి

సూళ్లూరుపేట, మార్చి 18: టీడీపీలో తమ కుటుంబానికి జరిగిన అవమానం వల్లే పార్టీని వీడాల్సి వచ్చిందని వేనాటి రామచంద్రా రెడ్డి కుమారుడు సుమంత్ రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పూర్తి విషయాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని సుమంత్ అన్నారు.

సమస్యలు పరిష్కరించండి

స్పందన రద్దయినా కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు

తిరుపతి(కలెక్టరేట్) మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ విషయం తెలియక చాలామంది కలెక్టరేట్‌కు వచ్చారు. చేసేది లేక కలెక్టర్ లక్ష్మీశ తన చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు.


డబ్బు ఇవ్వకనే ఇచ్చామంటున్నారు..



నాకు 2022లో ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేసింది. 50 సిమెంటు బస్తాలు ఇచ్చారు. నేను అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకున్నాను. బిల్లుల కోసం గృహ నిర్మాణశాఖ వారిని కలిస్తే మూడు బిల్లులు ఇచ్చేశామని చెబుతున్నారు. ఒక్క పైసా కూడా నా అకౌంట్లో జమ కాలేదు. ఇదెక్కడి అన్యాయం. మీరైనా న్యాయం చేయండి.

\- మునీంద్రమ్మ, చిల్లకూరు గ్రామం, పెళ్లకూరు మండలం

ఆరోగ్యశ్రీ కార్డు తొలగించారు



ప్రభుత్వం నా ఆరోగ్యశ్రీకార్డును తొలగించింది. ఇటీవల వైద్యం కోసం స్విమ్స్‌కు వెళితే ఆ విషయం తెలిసింది. వృద్ధుడినైన నాకు డబ్బు పెట్టి వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఉన్న కొంచెం పొలం బిడ్డలు చేసుకుంటున్నారు. జీవనాధారం లేని నాకు వైద్యం కోసం ఆరోగ్యశ్రీకార్డు పునరుద్ధరించండి.

\- కృష్ణారెడ్డి, పుల్లూరు, పెళ్లకూరు మండలం